
వార్త
ఆదివారం
ఏప్రిల్ 13, 2025
పుడమికి తాపం..
జగతికి శాపం!

# తారాతీరం

# 18న సారంగపాణి జాతకం



**శ్రీదేవి మూవీస్** అధినేత శివలెంకకృష్ణప్రసాద్, దర్శకుడు మోహనకృష్ణ ఇంద్రగంటిలది సూపర్ హిట్ కాంబినేషన్ 'జెంటిల్‌మన్', 'సమ్మోహనం' విజయాల తర్వాత వాళ్లిద్దరి కలయికలో రూపొందుతున్న మూడో చిత్రం 'సారంగపాణి జాతకం'. ఇందులో ప్రియదర్శి హీరోగా నటించారు. ఏప్రిల్ 18న ఈ సినిమాను విడుదల చేయనున్నారు.

'సారంగపాణి జాతకం'లో ప్రియదర్శి సరసన తెలుగమ్మాయి రూప కొడువాయూర్ కథానాయికగా నటించారు. ఇటీవల ఈ సినిమా నుంచి విడుదలైన 'సారంగో సారంగా', 'సంచారి సంచారీ' పాటలు ట్రెండ్ అవుతుండగా, టీజర్‌లోని మాటలు, హాస్య సన్నివేశాలు అందరి దృష్టిని ఆకర్షించాయి. వేసవిలో హాయిగా కుటుంబ సమేతంగా ఎంజాయ్ చేసే చిత్రమిది. దర్శకులు మోహనకృష్ణ ఇంద్రగంటి అద్భుతంగా తీశారు. ప్రియదర్శి, రూప కొడువాయూర్ జంటగా నటించిన ఈ సినిమాలో నరేష్ విజయకృష్ణ, తనికెళ్ళ భరణి, శ్రీనివాస్ అవసరాల, వెన్నెల కిశోర్, వైవా హర్ష, శివన్నారాయణ మొదలైనవారు ఇతర ముఖ్య పాత్రలు పోషించారు. వివేక్ సాగర్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రానికి డీఓపీగా పీజీ విందా, ఎడిటర్‌గా మార్తాండ్ కె. వెంకటేష్ వ్యవహరిస్తున్నారు.

# నాని 'హిట్'లో దుల్కర్ సల్మాన్

**నేచురల్** స్టార్ నానికి చెందిన వాల్ పోస్టర్ సినిమా బ్యానర్‌లో రూపొందే హిట్ ఫ్రాంఛైజ్ చిత్రాలకు మంచి క్రేజ్ ఉంది. శైలేశ్ కొలను దర్శకుడిగా వ్యవహరిస్తున్న ఈ ఫ్రాంఛైజ్‌లో ఇప్పటిదాకా రెండు సినిమాలు రాగా రెండూ విజయం సాధించాయి. మొదటి భాగంలో విశ్వక్‌సేన్, రెండో భాగంలో అడివి శేష్ నటించారు. మూడో భాగంలో నాని నటిస్తున్నాడు.

'హిట్3' మే 1న ప్రేక్షకుల ముందుకు రానుంది. అయితే 'హిట్3'లో మరో హీరో ఎంట్రీ ఉంటుందని తెలుస్తోంది. 'హిట్2' చివరిలో నాని పాత్రను పరిచయం చేసి, 'హిట్3'కి లీడ్ ఇచ్చిన సంగతి తెలిసిందే. 'హిట్3' చివరిలో కూడా ఒక పాత్రను ఇంట్రడ్యూస్ చేసి, 'హిట్4'కి లీడ్ ఇవ్వబోతున్నారట. అందుకోసం ఒక క్రేజీ హీరోని రంగంలోకి దింపబోతున్నట్లు తెలుస్తోంది. ఆ హీరో ఎవరో కాదు మలయాళ స్టార్ దుల్కర్ సల్మాన్. 'హిట్' ఫ్రాంఛైజ్‌లో నందమూరి బాలకృష్ణ, రవితేజ వంటి స్టార్స్ భాగమయ్యే అవకాశముందని ఆమధ్య వార్తలొచ్చాయి. కానీ, ఇప్పుడు దుల్కర్ సల్మాన్ పేరు తెరపైకి వచ్చింది. దుల్కర్‌కి తెలుగునాట మంచి క్రేజ్ ఉంది. మహానటి, సీతారామం, లక్కీ భాస్కర్ వంటి సినిమాలతో తెలుగులో హ్యాట్రిక్ విజయాలను

ఈ క్రమంలో 'హిట్' ఫ్రాంఛైజ్‌లో దుల్కర్ భాగమయ్యాడనే వార్త ఆసక్తికరంగా మారింది.





ఆదివారం వార్త

13 ఏప్రిల్, 2025

## మంచి ముత్యాలు

మనసులో బాధ నెత్తిమీద బరువు లాంటిది. మిత్రుడితో ఆ బాధను వెళ్ళగక్కితే మనసు తేలికవుతుంది. బాధ దూదిపింజలా ఎగిరిపోతుంది. జీవిత మంటే మధుర క్షణాల, చేదు అనుభవాల సమ్మేళనం, సమ్మిళితం, ఈ అక్షర సత్యామృతం.

## కదంబం


'సంఘీ'భావం....5

భారత్‌పై ట్రంప్ పన్నుల పెనుభారం

కవర్ స్టోరీ..6

పుడమికి తాపం..

జగతికి శాపం !

సాహిత్యం.. 11

ఎల్లలెరుగని 'తల్లి తెలుగు'

ఈ వారం కవిత్వం...12

మరుగుజ్జుత్వం - 14

కథ..20

మారుతున్న స్నేహం తీరుతెన్నులు 24

వాస్తు 25

కోవెలల కొలవు కొల్లిపర 26

ఎర్ర బంగారం కుంకుమ పువ్వు 28

ఇంకా...

మొగ్గ

వారఫలం

వగైరా..వగైరా..


## సమాచారం

### వృథా నీళ్లనూ వాడేద్దాం !

ఇప్పుడు ప్రతి ఒక్కరి ఇంట్లో వాటర్ ప్యూరిఫయర్ అనేది తప్పనిసరి అయిపోయింది. దీంతో మనకు మంచి నీళ్లు అందడం సరే, కానీ ఆ ప్రక్రియతో ఎన్ని నీళ్లు వృథాగా పోతాయో తెలుసా? ఒక లీటరు మంచి నీటిని శుద్ధి చేయడానికి దాదాపు మూడు లీటర్ల నీళ్లు. ఆ లెక్కన రోజుకు ఒక్కో ఇంట్లో ఎన్ని లీటర్ల నీళ్లు వృథా అవుతున్నాయో మీరే అర్థం చేసుకోండి. ఇప్పుడు ఆ సమస్యకు పరిష్కారంగానే వాటర్ స్టోరేజ్ బాక్సులొచ్చాయి. ఫిల్టర్‌కు అనుసంధానంగా ఉండే దీని ద్వారా నిల్వ చేసిన నీటిని పాత్రలు శుభ్రం చేయడానికీ, మొక్కలకు పోయడానికీ ఉపయోగించుకోవచ్చు. అంతేకాదు, ప్యూరిఫయర్ వైర్లు సింక్‌లోకి వేలాడుతూ గజిబిజిగా కనిపించవు కూడా.



### ఆహారంలో పుట్టగొడుగులు

ఎక్కువకాలం జీవించడం ఒకెత్తయితే, బతికినంత కాలం ఆరోగ్యంగా జీవించ డం మరొకెత్తు. ఇలాంటి నాణ్యమైన జీవితాన్నే అందిస్తాయట పుట్టగొడుగులు. వీటిని తరచూ ఆహారంలో చేర్చు కుంటే డెమెన్షియా, సార్కో పెనియా (కండర క్షీణత) వంటి సమస్యలు రాకుండా ఉంటాయట. జర్మనీకి చెందిన లెబనీజ్ ఇన్‌సెషన్ ఆఫ్ ఎనలిటికల్ సైన్ ప్రకారం... వయసు పెరిగేకొద్దీ మనలో కొన్ని కీలకమైన ఎంజైములు తగ్గిపోతూ ఉంటాయి. ఫలితంగా కండరాల క్షీణత మొదలవుతుంది. అలాగే ఒత్తిడి తట్టుకునే శక్తి కూడా తగ్గుతుంది. వీటికి ఎర్గోథయొనైన్ అనే మూలకం పరిష్కారం సూచిస్తుంది. ఇది మనకి ఒత్తిడిని జయించే శక్తిని ఇవ్వడంతో పాటు, కండరాలు క్షీణించకుండా చూస్తుంది. వయసుతో సంబంధం లేకుండా చురుగ్గా ఉండేట్టు చేస్తుంది. అయితే ఈ మూలకాన్ని మన శరీరం సహజంగా ఉత్పత్తి చేసుకోలేదు. కానీ పుట్టగొడుగుల నుంచీ పులియబెట్టిన ఆహారం నుంచీ ఈ మూలకాన్ని అందుకోవచ్చుట. అందుకే వయసు పెరుగుతున్నా చురుగ్గా, చలాకీగా ఉండేందుకు పుట్టగొడుగులని ఆహారంలో చేర్చుకొమ్మంటున్నారు శాస్త్రవేత్తలు.


మీ రచనల్ని ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు.
sunmagvaartha@gmail.com







# గాజు దృశ్యం !



కొందరు కళాకారులు తలుచుకుంటే... కాగితాన్నే కాదండోయ్... ఏ వస్తువునైనా కాన్వాస్ మార్చేయగలరు. అబ్బురపరిచే చిత్రాలను గీసి ఆశ్చర్యచకితుల్ని చేయగలరు. ఈ గాజు గ్లాసులపై అలంకరించిన ప్రకృతి సౌందర్యాన్ని చూస్తే అది నిజమేనని ఒప్పుకోక తప్పదెవరైనా. సూర్యోదయి నీటిపైన ప్రసరిస్తున్న లేలేత కిరణాల వెలుగులూ.... లోయలూ, చెట్ల మధ్య నుంచి ప్రవహిస్తున్న సెలయేళ్లూ... మంచు కురిసిన అందాలు... ఇసుక తిన్నెలూ.. ఇదీ అదీ అనేముంది, సృష్టిలోని ప్రతి అందాన్నీ గాజు గ్లాసులమీద అంతే సహజంగా త్రీడీ అయిల్ పెయింటింగ్ రూపంలో తీర్చిదిద్దారు. దూరం నుంచి చూస్తే... గ్లాసులోపల బొమ్మల్ని అలా ఎలా పెట్టారబ్బా! అని ఆశ్చర్యపరిచేలా ఆవిష్కరించిన ఈ కళాకారుల పనితనం నిజంగా అద్భుతం కదూ!













'సంఘీ' భావం



# భారత్‌పై ట్రంప్ పన్నుల పెనుభారం

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధిస్తున్న సుంకాలు భారతదేశ ఆర్థిక వ్యవస్థపై పెనుభారాన్ని మోపుతోంది. ప్రపంచ దేశాల్లో ఒక్క భారతదేశమే కాదు అనే దేశాలు పన్నులతో ఇబ్బందులు పడుతున్నాయి. ఒకరకంగా చెప్పాలంటే ప్రపంచ వాణిజ్య యుద్ధానికి ట్రంప్ వైఖరి దారితీస్తోందని అర్థం చేసుకోవచ్చు. ముఖ్యంగా భారత్, చైనా, ఐరోపా దేశాలపై కూడా ఆయన హెచ్చుస్థాయిలోనే సుంకాలు వేశారు. దిగుమతులను కట్టడి చేయడంతో పాటు ఆయా దేశాలు అమెరికా ఉత్పత్తుల దిగుమతులపై విధిస్తున్న పన్నులకు సమాంతరంగా ప్రతీకార సుంకాలను వేసినట్లు ఆయన తన నిర్ణయాన్ని సమర్థించుకున్నారు. ఈ పన్నుల నుంచి రష్యా, ఉత్తర కొరియా, కెనడా, మెక్సికో, క్యూబా, బెలారస్ తదితర దేశాలకు మినహాయింపులు ప్రకటించడం ట్రంప్ వైఖరిని స్పష్టం చేస్తోంది. కాగా, భారత్ నుంచి అమెరికాకు ఎగుమతి అవుతున్న ఉక్కు, అల్యూమినియం, ఆటో తదితర వస్తూత్పత్తులపై ఇప్పటికే అక్కడ 25 శాతం సుంకాలు పడుతున్నాయి. ఈ క్రమంలో ట్రంప్ సర్కారు తీసుకున్న తాజా నిర్ణయంతో ఏప్రిల్ 58 మధ్య మిగతా వస్తూత్పత్తులపై కనీస టారిఫ్ 10 శాతంతో మొత్తంగా 15 శాతంగా ఉంటుందని తెలుస్తోంది. దీని ప్రకారం ఉక్కు, అల్యూమినియం, ఆటో తదితర వస్తూత్పత్తులపై సుంకాల భారం తొలుత 35 శాతానికి, ఆ తర్వాత 57 శాతానికి చేరబోతున్నది. ఇక సెమీకండక్టర్స్, ఇంధన ఉత్పత్తుల ప్రయోజనాలూ అమెరికాకే దక్కాలంటే వాటినీ ఈ ట్రేడ్ వార్‌లోకి లాగవద్దని ట్రంప్ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారని భావిస్తున్నారు. ట్రంప్ సర్కారు ప్రతీకార సుంకాలతో భారత జీడీపీ వృద్ధిరేటు ఇబ్బందికర రీతిలో ఉండే ప్రమాదం ఉందని ఆర్థిక నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎగుమతులు కనీసం 5 శాతం పతనం కావచ్చని అంచనాలు వేస్తున్నారు. సుంకాల ప్రభావం పెరిగిన కొద్దీ వృద్ధిరేటు అంతకంతకూ తగ్గవచ్చని వారు పేర్కొంటున్నారు. అయితే ట్రంప్ ఒక వెసులుబాటు ఇచ్చారు. అమెరికా నుంచి వచ్చే వస్తు దిగుమతులకు ఆయా దేశాలు సుంకాలను తగ్గిస్తే తాము కూడా సుంకాల తగ్గింపు అంశంపై పరిశీలిస్తామని అన్నారు. దీనితో భారత్‌తో పాటు అనేక దేశాలు సుంకాలను సవరించే అవకాశాలు కనిపిస్తున్నాయి. అమెరికా నుంచి దిగుమతి చేసుకునే కార్లపై మన దేశం సుమారు 110 శాతం సుంకం విధిస్తోంది. అంటే ఒక కారు వాస్తవ విలువ పది లక్షలు ఉంటే దానిని భారత్‌లో సుంకాలు చెల్లించి దిగుమతి చేసుకుంటే 22 లక్షల రూపాయల వరకు ధర పలుకుతుంది. ప్రస్తుతం టెస్లా భారత్‌లో రావడానికి కూడా ప్రాథమికంగా ఇదే అవరోధంగా ఉండేది. అయితే ఇటీవల భారత ప్రధాని నరేంద్రమోడీ అమెరికాలో పర్యటన సందర్భంగా టెస్లా కార్ల అధినేత ఎలోన్‌మస్క్‌తో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో చేసుకున్న ఒప్పందం ప్రకారం టెస్లా కార్లపై సుంకాన్ని తగ్గిస్తామని మోడీ హామీ ఇచ్చారు. ఈ మేరకు సుంకాన్ని కేవలం 70 శాతానికి పరిమితం చేయడంతో టెస్లా ముంబయి, ఢిల్లీలో భారీ షోరూంల నిర్వహణకు సన్నాహాలు చేస్తోంది. అంతేకాకుండా టెస్లా ప్లాంట్లను కూడా ఇక్కడ ఏర్పాటుచేయడానికి రంగం సిద్ధం చేసింది. ఇదే విధంగా అనేక వస్తువులపై భారీగా సుంకాలు ఉన్నాయి. వీటన్నింటినీ సవరించడం ద్వారా అమెరికా సుంకాల నుంచి బయట పడేందుకు అధ్యయనం చేస్తున్నారు. అయితే దిగుమతి సుంకాలు తగ్గిస్తే భారత్‌లో తయారయ్యే అనేక వస్తువుల విక్రయాలు పడిపోయే పరిస్థితి ఉంటుంది. అమెరికాతో పాటు ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకునే వస్తువులపై కూడా సుంకాలు తగ్గించాల్సి వస్తుంది. ఇలాంటి చర్యలు భారత్ ఆర్థిక వ్యవస్థపైగా స్థానికంగా వస్తువుల ఉత్పత్తిపైనా చూపించే అవకాశం ఉంటుంది. ఎగుమతుల కంటే దిగుమతులు పెరిగే జీడీపీ మరింతగా దిగజారి ఆర్థిక సంక్షోభం తలెత్తే ప్రమాదం కూడా ఉంటుంది. ఇప్పటికే ట్రంప్ సుంకాల సునామీకి భారత స్టాక్ మార్కెట్ ఆటుపోట్లను ఎదుర్కొంటోంది. దీని ప్రభావం అనేక పరిశ్రమలపైనా, ఉత్పత్తులపైనా చూపిస్తుంది. ప్రధానంగా గత వారం రోజుల నుంచి బంగారం, వెండి ధరలు ఆటుపోట్లకు గురౌతున్నాయి. భారతదేశంలో బంగారం, వెండి ఆభరణాలుగానే కాకుండా పెట్టుబడికి, పొదుపులకు ఉపయోగిస్తుంటారు. అవసరం వచ్చినప్పుడు సునాయసంగా బంగారాన్ని మార్కెట్‌లో విక్రయించడం గాని, తనఖా పెట్టడం కాని చేయవచ్చు. ప్రస్తుతం బంగారాన్ని కుదువ పెట్టుకునేందుకు ప్రత్యేకంగా ప్రైవేటు సంస్థలు ఉన్నాయి. జాతీయ బ్యాంకుల్లో కూడా ప్రత్యేక విభాగాలు ఉన్నాయి. బంగారంతో వెళ్లిన వినియోగదారుడు కేవలం కొన్ని నిమిషాల వ్యవధిలోనే వాటిపై రుణం తీసుకుని వచ్చే సౌలభ్యాన్ని కల్పిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రస్తుతం ట్రంప్ విధిస్తున్న సుంకాలతో బంగారాన్ని కొనుగోలు చేయాలా, వద్దా అని ప్రజలు ఆలోచనలో పడ్డారు. గత కొన్ని రోజుల నుంచి బంగారం అమ్మకాలు గణనీయంగా పడిపోయాయని వర్తకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మొత్తం మీద ట్రంప్ సుంకాల ప్రభావం భారత ఆర్థిక వ్యవస్థపై తీవ్రంగానే చూపిస్తోంది.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ



# పుడమికి తాపం.. జగతికి శాపం!

కవర్ స్టోరీ

ఆనంద 'మైత్రేయ'మ్

**గ్లోబల్ వార్మింగ్ లేదా భూతాపం పెరగడం అంటే వాతావరణ మార్పు అనేది ఉష్ణోగ్రతలు, వాతావరణ నమూనాలలో దీర్ఘకాలిక మార్పులను సూచిస్తుంది. ప్రధానంగా శిలాజ ఇంధనాలను (బొగ్గు, చమురు, వాయువు వంటివి) కాల్చడం వ్యవసాయం వల్ల భూమి మీద వేడిని పట్టి ఉంచే వాయువులను ఉత్పత్తిని పెంచుతోంది. మానవ జనాభా పెరుగుతున్న కొద్దీ, శిలాజ ఇంధనాల పరిమాణం కూడా పెరుగుతోంది.**

మానవ కార్యకలాపాల వల్ల వాతావరణంలోకి విడుదలవుతున్న కార్బన్ డై ఆక్సైడ్, మీథేన్, నైట్రస్ ఆక్సైడ్ లాంటి హరిత గృహ వాయువులు భూవికిరణాన్ని అడ్డుకుని తిరిగి భూమి వేడెక్కడానికి కారణమవుతున్నాయి. ఈ విధంగా భూవికిరణం వల్ల భూమి చల్లబడటానికి బదులు తిరిగి భూవాతావరణం వేడెక్కడాన్ని గ్లోబల్ వార్మింగ్, భూతాపంగా పిలుస్తారు.

**గ్లోబల్ వార్మింగ్ వలన మార్పులకు ముఖ్య కారణం:** ఉత్తర దక్షిణ ధృవాలలో మంచు విపరీతంగా కరిగిపోవడం. ఇది చాలా ఆందోళన కలిగించే విషయం. గడచిన వేలాది సంవత్సరాలుగా కరగని మంచు, గత 200 సంవత్సరాలలో తీవ్రంగా కరిగిపోతోంది. దీనికి ముఖ్య కారణం.. పారిశ్రామిక విప్లవం వలన మారిన జీవన విధానాలు. దురదృష్టవశాత్తు మనం ఆ విప్లవంలోని చెడుని మాత్రం బాగా గ్రహించి జీర్ణించుకోవడం. దీనికి ఉదాహరణగా చూస్తే ఎక్కువగా వాహనాలు వాడటం, పరిశ్రమలు, పట్టణీకరణ మొదలైనవి. వీటి వల్ల కలిగే కార్బన్ ఉత్పాదకాలు (ఏమిషన్స్). ఇవి ఇప్పుడు తారాస్థాయికి చేరుకున్నాయి. వీటిని వెంటనే తగ్గించి తగు చర్యలు తీసుకోవాలి. ఈ కార్బన్ ఉత్పాదకాలు అధికంగా మారడం వల్ల భూమి మీద ఉన్న ఓజోన్ పొరకు చిల్లు పెట్టి భూమికి వచ్చిన సూర్యరశ్మి ఇక్కడే భూమి మీదే వుండేలా చేసి భూమి సగటు ఉష్ణోగ్రత పెరిగేలా చేసి ధృవాల్లో వున్న మంచు కరిగే లాగా చేస్తున్నాయి. దీనివల్ల పరోక్షంగా చాలా కష్టాలు పడుతున్నాం. కనుక వెంటనే స్పందించవలసిన అవసరం ఎంతైనా ఉంది.

సాధారణంగా భూగోళం సగటు ఉష్ణోగ్రత 15.4ుసి ఉంటుంది. ఈ ఉష్ణోగ్రత పెరగడాన్ని గ్లోబల్ వార్మింగ్ (భూగోళం వేడెక్కడం లేదా భూతాపం)గా పిలుస్తారు. సూర్యుడి నుంచి నిరంతరం బయటకు వెలువడే సౌరశక్తిని సౌర వికిరణం అంటారు. ఇందులో చాలా తక్కువ పరిమాణంలో శక్తి భూమిని చేరుతుంది. ప్రపంచవ్యాప్తంగా గ్లోబల్ వార్మింగ్ ప్రభావాన్ని మానవులు అనుభవిస్తున్నారు. ఎందుకంటే వాతావరణ మార్పు తీవ్రమైన కరువులు, కార్చిచ్చులు.. తీవ్రమైన తుఫాన్‌లతో పాటు భారీ వర్షపాతం కూడా తెస్తుంది. అధిక ఉష్ణోగ్రతలు పర్యావరణ వ్యవస్థలను మారుస్తున్నాయి. జంతువులు జీవించడానికి చల్లని ప్రదేశాలకు వలస వెళ్ళవలసి వస్తుంది. ప్రపంచ ఉష్ణోగ్రతలను తగ్గించడానికి ఏమీ చేయకపోతే, అనేక జాతులు అంతరించిపోతాయని శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. గ్లోబల్ వార్మింగ్ నీటి అంతరాలను మరింత పెంచుతోంది. ప్రస్తుతం నీటి అంతరాలను ఎదుర్కొంటున్న ప్రాంతాలు 1.5 డిగ్రీల సెల్సియస్ వేడెక్కడం కంటే తక్కువ సమయంలో మరింత తీవ్రమైన పరిస్థితులను ఎదుర్కోవలసి ఉంటుంది, 3 డిగ్రీల సెల్సియస్ వేడెక్కడం వల్ల ఇంకా దారుణమైన ఫలితాలు ఉంటాయి. ఈ ధోరణి ముఖ్యంగా తూర్పు అమెరికా, చిలీ, మధ్యధరా ప్రాంతం, దక్షిణ, తూర్పు భారతదేశం, ఉత్తర చైనా మైదానంలో స్పష్టంగా కనిపిస్తుంది. అదనంగా, ఇటలీ, మడగాస్కర్, తూర్పు తీరంలోని కొన్ని యుఎస్ రాష్ట్రాలు (నార్త్ కరోలినా, వర్జీనియా), గ్రేట్ లేక్స్ ప్రాంతం (విస్కాన్సిన్, మిన్నెసోటా, ఇల్లినాయిస్) వంటి ప్రాథమిక వాతావరణంలో సాపేక్షంగా ప్రభావితం కాని కొన్ని ప్రాంతాలు మరింత దిగజారుతాయని అంచనా.

ప్రపంచవ్యాప్తంగా బిలియన్ల మంది ప్రజలు జీవితంలోని ముఖ్యమైన అంశాలలో ఒకటైన పరిశుభ్రమైన నీటిని తగినంతగా పొందలేకపోతున్నారు. ఇటీవలి సంవత్సరాలలో ప్రభుత్వాలు సహాయక బృందాలు నీటి కొరత ఉన్న ప్రాంతాలలో నివసించే అనేక మందికి అందుబాటులో ఉండటానికి సహాయం చేసినప్పటికీ, గ్లోబల్ వార్మింగ్, జనాభా పెరుగుదల కారణంగా మరింత తీవ్రమవుతుందని అంచనా వేయబడింది.

వృక్షాలు, జంతువులు, మానవాళి మనుగడకు, పెరుగుదలకు గాలి తరువాత ముఖ్యమైనది నీరు. ఇది ప్రకృతి సమస్త జీవులకు ప్రసాదించిన ఒక అపురూపమైన వరం. తాగునీరు అరుదైన వస్తువుగా మారింది. ప్రకృతి వనరుల్లో భాగమైన నీరు సకల జీవజాతికి ప్రాణాధారం. పంటలకు, మానవజాతి మనుగడకు జలవనరులు కీలకం.

కానీ, మానవుడు తన అవసరాల నిమిత్తం నీటిని ఇష్టారీతిగా వినియోగిస్తున్నందున భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయి. గ్రామాలు, పట్టణాలు అనే తేడా లేకుండా నీటి ఎద్దడి నానాటికి తీవ్రరూపం దాలుస్తోంది. ప్రభుత్వాలు ఎంతగా నిధులు ఖర్చు చేస్తున్నా సాగునీటికి, తాగునీటికి ఇబ్బందులు తప్పడం లేదు. ఋతుపవనాల అనిశ్చితి, ఉష్ణోగ్రతల్లో



మార్పులు, జల సంరక్షణపై నిర్లక్ష్యం కారణంగా నీటి ఎద్దడి రానురానూ జటిలమవుతోంది.

మనిషి సజీవంగా ఉండాలంటే తాగేనీరు ఎంతో ముఖ్యం. ఒక వ్యక్తి ఆహారం లేకుండా ఒక నెల పాటు జీవించగలడేమో కానీ, నీరు లేకుండా నాలుగు రోజులు కూడా జీవించలేడు. ఒక వ్యక్తి తన జీవితాంతం సగటున 75,000 లీటర్ల నీరు తాగుతాడు. ఒక వ్యక్తి ఆరోగ్యంగా ఉండటానికి ప్రతిరోజు 3 నుండి 4 లీటర్ల నీరు రాగాలి, మన శరీరంలో 66% నీరు ఉంటుంది. మన మెదడు 75% నీరు, మన ఎముకలు 25%, మన రక్తంలో 83% నీరు ఉంటాయి. అయితే తాగేనీరు ఆరోగ్యవంతులను చేస్తుందనే ప్రశ్నకి సమాధానం బహుశా లేద నే చెప్పాలి.

వర్షాభావ పరిస్థితులతో బావులు, చెరువులు, బోర్లు ఎండిపోవడం సర్వసాధారణమైంది. బానుడు ఉగ్రరూపం దాల్చడంతో దేశంలోని ప్రధాన రిజర్వాయర్లలో నీరు అడుగంటిపోతోంది. గత పదేళ్లతో పోలిస్తే నీటి ఎద్దడి తీవ్రతరం అయ్యింది. దీంతో నీటి సంక్షోభం ఎప్పుడూ లేనంతగా విలయతాండవం చేస్తోంది. దాదాపు 450నదులు ప్రవహించే భారతదేశంలో కోట్లమంది నీటికోసం కటకటలాడడం చాలా బాధాకరమైన విషయం.

1947లో మనదేశంలో నమోదైన తలసరి నీటి లభ్యత 2018 కొచ్చేసరికి నాలుగోవంతుకు పడిపోయింది. ప్రతి పౌరుడి సగటు నీటి లభ్యత ప్రాతిపదికన వరుసగా ప్రపంచ ర్యాంకింగ్‌లలో అమెరికా 545 లీటర్లతో, ఆస్ట్రేలియా 481 లీటర్లతో, ఇటలీ 380 లీటర్లతో, జపాన్ 375 లీటర్లతో వరుసగా మొదటి నాలుగు, స్థానాల్లో ఉన్నాయి. కానీ భారత్ తలసరి నీటి లభ్యత కేవలం 91.5 లీటర్లు ఉంది. మరీ దారుణమైన విషయమేమిటంటే కనీసం అందుబాటులో ఉన్న ఈ నీరైనా సురక్షితమైనదా అంటే అదీకాదు. ప్రమాదకర స్థాయిలో ఆర్సెనిక్ కలిసిన నీటిని 19 శాతం భారత ప్రజలు తాగుతున్నట్లు అధ్యయనాలు చెబుతున్నాయి.

గ్రామాల్లో, పట్టణాల్లో నివసించే కోట్లాది ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేసే ప్రక్రియ సక్రమంగా నిర్వర్తించ లేకపోతున్నాయి దేశాలకి దేశాలు. అధిక జనాభా కలిగిన భారత దేశం స్వచ్ఛమైన తాగునీరు అందించలేకపోవడంతో అతి పెద్ద సమస్యగా రూపుదాల్చింది. దేశంలోని 80% జనాభా మంచినీళ్ల రూపంలో విషం తాగుతున్నారు. దిగ్భ్రాంతి కలిగించేలా దాదాపు భారతదేశ జనాభాలో చాలామంది విషపూరిత మంచి(?) నీళ్లు తాగుతున్నారు. అన్ని రాష్ట్రాల్లోని భూగర్భ జలాల్లో విషపూరిత లోహాలు అధికంగా ఉన్నట్టు గణాంకాలు చెప్తున్నాయి. జల్ శక్తి మంత్రిత్వ శాఖ గణాంకాల ప్రకారం దేశంలో 80 శాతానికి పైగా జనాభా భూగర్భం నుంచి వచ్చే నీటినే తాగునీటిగా వాడుతున్నారు. అయితే భూగర్భ జలాల్లో ప్రమాదకర లోహాలు నిర్దేశిత మోతాదు కంటే అధికంగా ఉంటే నీరు విషపూరితమేనని మంత్రిత్వ శాఖ చెప్పింది. తాగునీటి వనరులు కలుషితమై ఉన్న నివాస ప్రాంతాల సంఖ్యను కూడా ప్రభుత్వం వెల్లడించింది.

నీటిలో అధిక మొత్తంలో సీసం నాడీ వ్యవస్థపై ప్రభావం చూపుతుంది. అధిక స్థాయి కాడ్మియం మూత్ర పిండాల వ్యాధుల ప్రమాదాన్ని పెంచుతుంది. మొత్తం మీద విషపూరిత మంచినీళ్లు తాగుతూ దేశ జనాభా అనారోగ్యానికి గురవుతున్నారు. ఫలితంగా అనారోగ్య భారత్ దిశగా పాలకులు దేశాన్ని తీసుకెళుతున్న పరిస్థితి నెలకొంది. 2030 నాటికి దేశ జనాభాలో 40 శాతం మందికి గొంతు తడుపుకోవడానికి నీళ్లే దొరకని పరిస్థితి వస్తుందనీ కాంపోజిట్ వాటర్ మేనేజ్ మెంట్ ఇండెక్స్ (సిడబ్ల్యుఎంఐ) రిపోర్ట్ కూడా గతంలో వెల్లడించింది. నీళ్లకు సంబంధించి దేశం డేంజర్ జోన్‌లో ఉందనడంలో రాజీ పడనక్కర్లేదు.

గ్రామాల్లో తాగు నీటికి ప్రధాన వనరులు, చేతి పంపులు, బావులు, నదులు, చెరువులు, సాధారణంగా గ్రామాల్లో ఈ నీటిని శుభ్రం చేయడానికి మార్గం లేదు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు విషపూరితమైన నీటిని తాగాల్సి వస్తోందని రాజ్యసభ వెల్లడించింది. ప్రభుత్వం జల్ జీవన్ మిషన్‌ను 2019లో ప్రారంభించినట్లు లోక్‌సభకు తెలిపింది. దీని కింద 2024 నాటికి ప్రతి గ్రామీణ ఇంటికి కుళాయిల



ద్వారా తాగునీరు సరఫరా చేయాలి. ప్రభుత్వం ఇచ్చిన డేటా ప్రకారం ఇప్పటి వరకు 9.81 కోట్ల కుటుంబాలకే కుళాయి నీటిని సరఫరా చేస్తున్నారు. అమృత 2.0 పథకాన్ని కేంద్ర ప్రభుత్వం అక్టోబర్ 2021లో ప్రారంభించింది. 2026 నాటికి అన్ని నగరాలకు కుళాయి నీటిని సరఫరా చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారని రాజ్యసభ వేదికగా ప్రభుత్వం చెబుతోంది.

నీరు రాష్ట్రానికి సంబంధించిన అంశమని, కాబట్టి ప్రజలకు తాగునీరు అందించాల్సిన బాధ్యత రాష్ట్రాలదేనని కేంద్ర ప్రభుత్వం పార్లమెంటు వేదికగా తెలపడం గమనార్హం. అయితే కేంద్ర ప్రభుత్వం కూడా స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు అనేక పథకాలు అమలు చేస్తోందని వివరించింది. యుద్ధ ప్రాతిపాదికన వాటర్ రిసోర్సెస్ మేనేజ్ మెంట్‌ను పక్కాగా అమలు చేయాలని సూచించింది. మంచినీళ్లు దొరక్కపోవడంతో చాలా మంది కలుషిత నీళ్లని తమకు తెలిసిన పద్ధతిలో శుద్ధి చేసుకుని తాగుతున్నారు. దీంతో ప్రతి ఏడాది రెండు లక్షల నంది కలుషిత నీళ్లు తాగి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు.



## అందరికీ స్వచ్ఛమైన నీరు

అందరికీ స్వచ్ఛమైన నీరు అందించాలనేది ముఖ్యమైన అడుగు, దీనిని పరిష్కరించకపోతే, ఖచ్చితంగా ప్రపంచ సంక్షోభం ఏర్పడుతుంది.

ప్రపంచ జనాభాలో 26 శాతం మందికి శుద్ధమైన తాగునీరు అందడం లేదని, 26 శాతం మందికి శుద్ధమైన సదుపాయాలు అందుబాటులో లేవని ఐక్యరాజ్యసమితి నివేదిక వెల్లడించింది. ప్రపంచంలోని ప్రజలందరికీ 2023 నాటికల్లా శుద్ధమైన తాగునీరు, పారిశుధ్య సదుపాయాలు అందాలని ఐక్యరాజ్య సమితి పెట్టుకొన్న లక్ష్యానికి చాలా దూరంలో ఉన్నామని యుఎస్ వరల్డ్ వాటర్ డెవలప్‌మెంట్ రిపోర్టు-2023లో పేర్కొన్నది. లక్ష్యాలను చేరుకోనేందుకు ఏడాదికి 600 బిలియన్‌ల నుంచి ఒక లక్ష కోట్ల డాలర్ల వరకు ఖర్చు చేయాల్సి ఉంటుందని ఒక అంచనా.

తమిళనాడు, కర్ణాటక, పశ్చిమ బెంగాల్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, ఒడిశా లాంటి రాష్ట్రాల్లోని చాలా జిల్లాల్లో ఫ్లోరైడ్ సమస్య ఉంది. చాలా చోట్లు సీసం, క్రోమియం వంటివి నీటి మౌలిక స్వభావాన్ని మార్చుతున్నాయి. భూగర్భజలాల్ని విపరీతంగా తోడేస్తున్నాము కానీ, రీఛార్జింగ్ ఊసెత్తడం లేదు. ఇది భవిష్యత్ విపత్కర పరిణామాలకు అద్దం పడుతుంది. అందుకే నీటి రీఛార్జింగ్ విషయంగా శాస్త్రీయంగా ఆలోచించాలి. శాస్త్రసాంకేతిక రంగంలో ప్రజ్ఞతో మానవాళి కీర్తి ఎదుగొచ్చు. కానీ ఉన్న నీటిని వినియోగించడమే తప్ప కొత్తగా సృష్టించగల అవకాశం లేని పరిస్థితులను అర్థం చేసుకొని వర్షజలాల పరిరక్షణ, భూగర్భజల మట్టాల సంరక్షణ, వృథా నివారణ, నీటి వాడకంలో పొదుపును ఒక జాతీయ సంస్కృతిగా పాటించాలి. జల కాలుష్యాన్ని నివారించి నీటి కటకటలేకుండా సకల చర్యలు తీసుకోవాలనీ.

ఈ విషయంలో ఆస్ట్రేలియా, యూకే, దక్షిణాఫ్రికాలు ముందున్నాయి. మొబైల్ జిప్ సాంకేతికతలో ఇజ్రాయిల్, అరబ్ దేశాలు 70 శాతం మురుగునీటిని సేకరించి శుద్ధి చేసి మళ్లీ వాడేలా చర్యలు తీసుకుంటున్నాయి.

గత 40 ఏండ్లుగా ప్రపంచవ్యాప్తంగా నీటి వినియోగం ఏడాదికి దాదాపు ఒక శాతం వరకు పెరుగుతోంది. అయితే అందుకు తగ్గ ప్రణాళికలు రూపుదిద్దుకోవడంలో చాలా వెనకబడి ఉన్నామని ఇటీవల బెంగలూరు నీటి ఎద్దడి, ఫలితాలు తేటతెల్లం చేస్తున్నాయి.

ప్రబలుతున్న ఈ జల సంక్షోభానికి గల ముఖ్యకారణం నేటి నాగరిక మానవుడు అవలంబిస్తున్న నీటి వినియోగ పద్ధతులే అనేది నిర్వివాదాంశం. ఈ నేపథ్యంలో నీటి సంరక్షణ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. సమగ్రమైన జల సంరక్షణ ద్వారా జల భద్రత చేకూరుతుందని ప్రచారం చేయడానికి జలశక్తి అభియాన్ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది. ప్రతి వర్షపునీటి బొట్టును ఒడిసి పట్టడానికి ఈ కార్యక్రమాన్ని రెండు దశల్లో నిర్వహించాలన్నది ప్రభుత్వ సంకల్పం. మొదటి దశలో ఏటా జులై నుండి సెప్టెంబర్ 15 వరకు నైరుతి రుతుపవన సమయంలో, రెండవ దశలో అక్టోబర్ నుండి నవంబర్ 30 వరకు ఈశాన్య రుతుపవనాల సమయంలో అవగాహన కల్పించాలనే బృహత్తర లక్ష్యాలతో ఈ పథకాన్ని నిర్దేశించారు. వృథాగా పోతున్న వర్షపు నీటి వినియోగం, సమర్థవంతమైన నీటి పొదుపు ప్రణాళికలు గురించి ప్రచారం చేయాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది.

సాంప్రదాయ నీటి వనరులైన చెరువులు, బావులు, వాగులను పునరుద్ధరించి, వాటర్ షెడ్ అభివృద్ధి





కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తారు. భారీ స్థాయిలో వర్గీకరణ కార్యక్రమాలను చేపడుతూ, ప్రతి ఇంటి ఆవరణంలో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకొని నీటి వృథాను అరికడుతూ, నీటి కష్టాలకు శాశ్వత పరిష్కారాన్ని చూపించాలని భావిస్తున్నారు. గ్రామస్థాయి నుండి పట్టణ స్థాయి వరకు విద్యార్థులు, మహిళలు, అధికారులు, ప్రజాప్రతినిధులు, యువకులు సామాజిక ఉద్యమకారులు ఈ కార్యక్రమంలో పాలుపంచుకొని ఒక ప్రజా ఉద్యమంగా సుస్థిర నీటి సంరక్షణకు కృషి చేయాల్సి ఉంది.

తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, ఒడిశా లాంటి రాష్ట్రాల్లోని చాలా జిల్లాల్లో ఫ్లోరైడ్ సమస్య ఉంది. చాలా చోట్ల సీసం, క్రోమియం వంటివి నీటి మౌలిక స్వభావాన్ని మార్చుతున్నాయి. భూగర్భ జలాల్ని విపరీతంగా తోడేస్తున్నాము కానీ రీఛార్జింగ్ ఊసెత్తడం లేదు. ఇది భవిష్యత్ విపత్కర పరిణామాలకు అద్దం పడుతుంది. అందుకే నీటి రిఛార్జింగ్ విషయంగా శాస్త్రీయంగా ఆలోచించాలి. శాస్త్రసాంకేతిక రంగంలో ప్రజ్ఞతో మానవాళి కీర్తి ఎదుగొచ్చు. కానీ ఉన్న నీటినీ వినియోగించడమే తప్ప కొత్తగా సృష్టించగల అవకాశం లేని పరిస్థితులను అర్థం చేసుకొని వర్షజలాల పరిరక్షణ, భూగర్భజల మట్టాల సంరక్షణ, వృథా నివారణ, నీటి వాడకంలో పొదుపును ఒక జాతీయ సంస్కృతిగా పాటించాలి. జల కాలుష్యాన్ని నివారించి నీటి కటకటలేకుండా సకల చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వ కృషితో మాత్రమే విజయం సాధించలేమనే వాస్తవాన్ని మనం అర్థం చేసుకోవాలి. విజయం సాధించాలంటే జల సంరక్షణ సంబంధిత కార్యక్రమాల్లో వీలైనంత మేర ప్రజలతో పాటు సామాజిక సంస్థలను, పౌర సమాజాన్ని భాగస్వాములను చేయాలి. జల సంరక్షణకు చేపట్టిన కార్యక్రమాలను ప్రతి ఒక్కరూ అర్థం చేసుకొని, జలశక్తి అభియాన్‌ను ఉద్యమంగా తీసుకువెళ్లి



నీటి కరవుకు చరమగీతం పాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది. శాస్త్రసాంకేతిక రంగంలో ప్రజ్ఞతో మానవాళి కీర్తి ఎదుగొచ్చు. కానీ ఉన్న నీటిని వినియోగించడమే తప్ప కొత్తగా సృష్టించగల అవకాశం లేని పరిస్థితులను అర్థం చేసుకొని వర్షజలాల పరిరక్షణ, భూగర్భజల మట్టాల సంరక్షణ, వృథా నివారణ, నీటి వాడకంలో పొదుపును ఒక జాతీయ సంస్కృతిగా పాటించాలి. ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు, యువత జల సంరక్షణ గురించి ప్రజల్లో విస్తృత ప్రచారం చెయ్యాల్సిన అవసరం ఉంది.

గృహావసరాలకు, పానీయాలు, ఆల్కహాల్, రసాయన వాణిజ్య పరిశ్రమల అవసరాలకు నీటిని పొదుపుగా వినియోగించాలి. మురుగు నీటిని శుద్ధి చేసి పునర్వినియోగానికి తేవాలి. భవనాల వద్ద ఇంకుడు గుంతల నిర్మాణం చేసి వర్షాకాల వరద నీటిని భూమిలోకి చేర్చి భూగర్భ జలాలు వృద్ధి చేయాలి. చెరువులు లోతు చేసి పటిష్టమైన గట్లు ఏర్పాటు చేసి నీటి నిల్వలు పెంచాలి. బిందు సేద్యం మరింతగా పెంచాలి.

### ఆధునిక సాంకేతికత, సేవలతో అభివృద్ధి చెందుతున్న సమాజానికి..

మరోవైపు పేదరికం, పోషకాహార లోపం, అనారోగ్య సమస్యలు, సామాజిక బహిష్కరణ, వనరుల క్షీణతల మధ్య కొట్టుమిట్టాడుతున్న సమాజానికి దారితీసే గణనీయమైన ఆర్థిక వృద్ధికి మధ్య వైరుధ్యం మన సమాజంలో చాలా స్పష్టంగా కనిపిస్తున్నది. వివిధ సామాజిక సమూహాల మధ్య జీవన శైలి భావనలు కూడా విభిన్నంగా పుట్టుకొస్తున్నాయి. అంటే, వాతావరణ మార్పుల పట్ల అవగాహన, అవసరమైన చర్యలు కూడా భిన్నంగా ఉంటాయి.

1 డిగ్రీ గ్లోబల్ వార్మింగ్ కారణంగానే ఈ విపరీత పరిణామాలు జరుగుతున్నాయి. గ్లోబల్ వార్మింగ్ వల్ల సంభవించే వేడిగాలులు, అధిక ఉష్ణోగ్రతలు మనుషుల ఆరోగ్యాన్ని దెబ్బతీయడమే కాకుండా అతిభారీ వర్షాలు, వరదలు, తుపానులకు కారణమవుతున్నది. తద్వారా రాష్ట్రవ్యాప్తంగా ప్రజల జీవితాలు అతలాకుతలమవడంతో పాటు జీవనోపాధి, ఆస్తులకు నష్టం జరుగుతున్నది. ఎలాంటి మౌలిక వసతులకు నోచుకోకుండా లోతట్టు ప్రాంతాల్లో నివసించే పేదలు వీటివల్ల ఎక్కువగా ప్రభావితమవుతున్నారు. సాంకేతికత, జీవనశైలి, పౌర సమాజంతో పాటు వ్యవస్థలో మార్పు, గ్రీన్ హౌస్ వాయు ఉద్గారాలకు ప్రధానంగా కారణమవుతున్న సంపన్న కుటుంబాల జీవనశైలిలో మార్పులు తీసుకొచ్చి ఉద్గారాలను తగ్గించవచ్చు. సంపన్నులతో పోలిస్తే తమ ప్రమేయం తక్కువగా ఉన్నప్పటికీ, గ్లోబల్ వార్మింగ్ సామాన్యులను ఎక్కువగా బాధిస్తున్నది. అందువల్ల ఈ చర్యల పర్యవసానాలు భిన్నంగా ఉంటాయి. ఇప్పటికే రకరకాల హెచ్చరికలు చేస్తోన్న ప్రకృతి గుణపాఠామూ చెప్తుందీ.. మొత్తం ప్రపంచానికి.

సింగిల్ పేజీ కథ

# నేను ఒంటరిని కాదు..

గురుమూర్తి పుస్తకాలు బాగా చదువుతాడు. అందుకే అతనికి రకరకాల జ్ఞాన విషయాలమీద అనుమానాలు, తద్వారా అనేక ప్రశ్నలు.

ఒక సాయంత్రం నా దగ్గరకొచ్చి "రా గోపీ అలా పార్కుకు వెళ్ళి చెట్ల మధ్య కూర్చుని పల్లీలు తింటూ మాట్లాడుకొందాం" అన్నాడు.

"గుడ్ ఐడియా" ఇద్దరం పాండురంగ పార్క్‌కి వెళ్ళి చెట్లకింద ఉన్న బెంచీ మీద కూర్చున్నాము. పల్లీలు అమ్మే అబ్బాయి వచ్చి చెరొక పొట్లం ఇచ్చి డబ్బులు తీసుకుని వెళ్ళాడు.

"ఈ మధ్య ఓ పుస్తకం చదువుతుంటే ఓ డౌట్ వచ్చింది"

"ఏ డౌట్?"

"మరేంలేదు మునులు, కొంతమంది సాధువులు కొండల్లో, కోనల్లో ఒంటరిగా ధ్యానాలు పూజలు, తపస్సులు చేస్తుంటారు కదా! మరి వారికి బోర్ కొట్టదా? భయం వేయదా? అని నా అనుమానం"

"నీవు చెప్పింది నిజమే మనం రేపు భైరవ కోన వెడదాం. అక్కడ అడవిలో వీరాస్వామి అనే సాధువు ఒంటరిగా ఏదో సాధన చేస్తున్నట్లు విన్నాను. అక్కడికి వెళ్ళి ఆయనను ఇంటర్వ్యూ చేస్తే మనకు బోలెడు విషయాలు తెలుస్తాయి" అని చెప్పాను.

"మంచి విషయం చెప్పావు రేపే బయలుదేరుతాం" అన్నాడు.

రెండో రోజే నీళ్ళ బాటిల్స్ తగిన సరంజామాతో వచ్చేసాడు గురుమూర్తి. బస్సులో భైరవకోన వెళ్ళి అడవి బయట కనబడిన ఇద్దరిని వీరాస్వామిని గురించి అడిగి ఎలాగో అడవిలోపలికి వెళ్ళి కుటీరంలో ఉన్న వీరాస్వామిని కలిసాం, ఆయనకు దండం పెట్టి పండ్లు ఇచ్చాం, ఆయన మొహంలో మంచి వర్చస్సు గమనించాం.

"స్వామీ మీ గురించి విన్నాం ఒంటరిగా మీరు ఇక్కడ సాధన, ధ్యానం చేస్తున్నట్లు మాకు కొందరు చెబితే తెలిసింది. మీకు అభ్యంతరం లేక పోతే మేము మిమ్మల్ని కొన్ని ప్రశ్నలు అడగవచ్చా?" అని అడిగాను.

"అడగండి నాకు ఏ అభ్యంతరం లేదు" అని శాంతగా చెప్పారు వీరాస్వామి.



"మీరు ఈ అడవిలో ఒంటరిగా ఉంటే సంఘజీవితం గుర్తుకు రాదా? క్రూర జంతువుల భయం లేదా? మీకు ఆహారం ఎలా?" అడిగాడు గురుమూర్తి.

"ఏం భయం నాయనా? నేను ఒంటరిని కాను ఈ చెట్లు నాకు తోడు. అవే ఆహారం ఇస్తున్నాయి. పక్షుల కిలకిలరావాలు, దూరంగా జంతువుల అరుపులు, చెట్లు చేసే గల గల ఆకుల చప్పుళ్ళు నాకు తోడు. నాతో చదివించే ఆధ్యాత్మిక గ్రంథాలతో నిత్య చైతన్యం! అన్నింటిలో ఆ భగవంతుణ్ణి చూస్తాను, అన్నింటి కంటే ఆ పైవాడు ఎప్పుడూ తోడు" చిరునవ్వుతో చెప్పాడు వీరాస్వామి.

"ఆశ్చర్య పోవడం మా వంతు అయింది. నిజమే ఆలోచిస్తే ఈ ప్రకృతిలో ఎవ్వరూ ఒంటరి కాదు!

-కంచనపల్లి వేంకట కృష్ణారావు

## సరదా రచనలకు ఆహ్వానం

రచయితల నుండి కథలు, కవితలు, సమకాలీన వ్యాసాలు స్వాగతిస్తున్నాం. రచనలతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జత చేయాలి. ఎంపిక కాని రచనలు తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. ఇతర పత్రికల పరిశీలనలో ఉన్న రచనలు దయచేసి పంపించకండి.

రచనలు పంపించాల్సిన చిరునామా: ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80.

sunmagvaartha@gmail.com

# ఎల్లలెరుగని 'తల్లి తెలుగు'

**జయసూర్య**

**విజయనగర సామ్రాజ్యంలో, విజయ ధ్వజం ఎగురవేసిన తెలుగు సరస్వతికి తంజావూరు, మధుర, మైసూరు, పుదుక్కోట పాలకులు అందలం పట్టారు. ఆ పాలకుల ఆదరణలో ఆంధ్రసాహిత్యం దక్షిణాంధ్ర యుగ వాఙ్మయంగా విలసిల్లింది.**




శ్రీ కృష్ణదేవరాయల కాలంనాటి భువన విజయం, తంజావూరు నాయక రాజమణి రఘునాథరాయలు కాలం 1600-1631లో ఇందిరామందిరంగా సంగీత, సాహిత్య నృత్య విశేషాలు, ప్రబంధ కావ్య, చాటు, యక్షగాన ప్రక్రియా వైవిధ్యంతో అలరారింది. తంజావూర్‌లో నాయకరాజుల తర్వాత 1674 నుండి మహారాష్ట్రుల పాలనలో ఆంధ్రవాఙ్మయం వినుతికెక్కింది. ఆంధ్ర సరస్వతి దక్షిణాధీశుల ముత్యాల శాల దీనారటంకాల తీర్థమాడిన ప్రశస్తి పొందింది. రఘునాథరాయల తర్వాత తంజావూరు పాలకుడు విజయ రాఘవ నాయకుడు (1633-1673) సభాస్థలి 'విజయరాఘవ విలాసం'లో శారదాధ్వజం అలరారింది. పదకవితకు పట్టాభిషేకంగా పదకవితా పితామహు డైన క్షేత్రయ్య పాదం పెట్టినదీ విజయ రాఘవుని సభలోనే. యక్షగాన ప్రక్రియ లో మరొక ముఖ్య విశేషం అన్యభాషా వ్యవహారం. సంస్కృత భాషలో సంభా షణం ఈ చూర్ణిక, సంస్కృత చూర్ణ లక్షణ లక్షితం. ఈ యక్షగానంలో పూజారి మాటలు కేవలం తమిళం. ఇందులోని పదాలు వచన గీతాలు, వచన ప్రధానమైన యక్షగానాలు నాటి సాహితీ సంపద మధురశాఖలో వచన కావ్యం, తంజావూరు శాఖలో యక్ష గానంగా విజయరాఘవుని ప్రాచీన తరంలో దక్షిణాంధ్రయుగ వాఙ్మయం విలసిల్లింది.

భాషలకు ఎల్లలు లేని స్వర్ణయుగం అది. తెలుగు, తమిళం, కన్నడం ఏ భేదాలు లేవు. తంజావూరు, మధుర, మైసూర్, పుదుక్కోట కోటి రఘునాథ తొండమాన్ పార్వతీ పరిణయ ప్రబంధ కర్త. ఆ కాలంలో మరొక సుప్రసిద్ధకవి కస్తూరి రంగకవి. పలాష్లే దగ్గర దుబాసిగా ఉండేవాడు. 'ఆనందరంగ రాట్ఛందం' ఈ కవి లక్షణ గ్రంథం- ఈ కవి కూడా పదకర్త. "కస్తూరి రంగ రంగా కావేటి రంగ రంగా" అనే మకుటం కల పదాలు ఈ కవివే తర్వాత త్యాగరాజు తరం ప్రవేశించింది. 1756-1847 మధ్యకాలం. ఆంధ్రసాహిత్య చరిత్రలో నిర్దిష్టమైన, నిర్దిష్టమైన యుగ విభజన కవి పరంగా, స్థలపరంగా, సాహిత్య వైలక్షణ సుస్పష్టంగా విరాజిల్లింది. తొలినాళ్ళల్లో పాత్రోచిత సంభాషణా ప్రాచుర్యం, పదకవితా ధోరణులు, కేవల యక్షగాన ప్రక్రియా వైవిధ్యం యుగ ధర్మమైంది. డా॥ కొర్లపాటి శ్రీరామమూర్తి దక్షిణాంధ్ర యుగ వాఙ్మయం గురించి తెలుగు వాఙ్మయ సంగ్రహ చరిత్రలోని ఒక అధ్యాయంలో తంజావూరు పాలకునిగా ఛత్రపతి శివాజీ సవతి సోదరుడు ఏ కోజీ తర్వాత శహాజీ (1684-1712) కాలంనాటి ఆస్థానకవుల యక్షగానాల ప్రధాన విశేషం మార్గనాటక ప్రభావం వివరించారు. కొరవంజి ఒకడు కొసరు, యక్షగాన ప్రాయాలైన ప్రబంధ నాట కాలు, పల్లకి సేవా ప్రబంధాలు శహాజీ ప్రత్యేక రచనలు. కిరాత విలాసం, సీతా కళ్యాణం, సతిదాన శూరం వంటి 20 యక్షగానాలున్నాయి. పౌరాణిక యక్షగానాలకు పాత్రలు ప్రబంధ పాత్రలు. ప్రతి పురాణ దంపతుల కళ్యాణానికి తంజావూరే కథారంగం. విజయ రాఘవుడో, శహాజీ వంటి రాజులు పెళ్ళి పెద్దలు. దేవుని మహత్యం కంటే మానవ మస్తత్వమే ప్రధాన విశేషంగా పరమేశ్వర సాక్షాత్కారం అందించారు దానభంగం, దాంపత్య ధర్మగాని కలగకుండా మనస్తత్వ ప్రధానంగా, సంఘర్షణాత్మక సంఘటనతో నాటకీయత జీవనాడిగా సాగినంది శహాజీ యక్షగానం. తమిళనాడు, కర్నాటక, కేరళ, మహారాష్ట్ర నాలుగూ నేడు ప్రత్యేక రాష్ట్రాలు. తమిళం, కన్నడం, మరాఠీ వంటి ఇరుగు పొరుగు సీమలలో నేడు తెలుగు పట్ల అభిమానం ఆదరణ వుండక పోవడం సహజం. సరిహద్దు లోని ప్రాచీనతలో తెలుగు సాహిత్యం అక్కడ వెల్లివిరిసిన చరిత్ర కనీసం అక్కడ స్థిరపడి కలిసి మెలిసి జీవిస్తున్న తెలుగు రచయితలు, కవులు మేధావులు గుర్తుచేసుకోవడం కర్తవ్యంగా భావించాలి. దక్షిణ భారతావనిలో భాషలను ముఖ్యంగా మాతృభాషల గురించి రాజకీయ నాయకులు కారణాలు ఏవైనా ప్రస్తుతం ఆలోచిస్తున్న కథనాలు వెలువడుతు న్నాయి. ప్రవాసాంధ్రులుగా కోట్లాదిగా తెలుగు మూలాలు వున్న తెలుగు జనావళి, మన తెలుగు రాష్ట్రాలవైపు మాతృభాషాభి మానంతో చూస్తున్నారు.

తరాల అంతరాలలోని పూర్వీకులను స్మరించుకొంటు న్నారు. కర్నాటక ఆదికవి పంపన అయినా, తమిళనాట త్యాగయ్య అయినా, మహారాష్ట్ర శహాజీ అయినా శతాబ్దాల క్రితం సాహితీ పరంగా తెలుగును ఆరాధించిన వారే మహారాష్ట్ర పరంగా పరిశీలిస్తే, 1928 సెప్టెంబరు 25న ముంబై కల్యాణ్‌లో, ఆంధ్ర సామాజిక పరిషత్ వి.రాందాస్ పంతులు నాటి నుంచి మాతృభాషా వికాసం కోసం మహాసభలు నిర్వర్తిస్తూ ప్రస్తుతం మహారాష్ట్ర ప్రభుత్వంచే తెలుగు సాహత్య అకాడమీ అక్కడ ఏర్పాటు చేయగల స్థాయి సాధించినట్లు ఇటీవల సాహితీ వేత్త సంగెనేని రవీంద్ర ఒక వ్యాసంలో వివరించారు. తెలుగు-తమిళం, తెలుగు-కన్నడం, తెలుగు-మలయాళం, తెలుగు-మరాఠీ మధ్య సంస్కృతి, ఆచార వ్యవహారాలు, సంప్రదాయాలు, ఆయా రాష్ట్రాల ప్రగతిలో నాడూ-నేడూ సామాజికంగా, రాజకీయంగా విడతీయలేని అవినాభావ సంబంధ బాంధవ్యాలున్నాయి. ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణలలో మాతృభాషా ప్రేమికులు, సాహితీ వేత్తలు ప్రభుత్వా లను కొంతైనా కదిలించగలిగితే మార్గం సుగమం అవుతుంది.

## ఈ వారం కవిత్వం

# పచ్చదనం

అక్కడ గతం నుండి వర్తమానానికి
అధునికత పచ్చి సేద తీరుతుంది
నాగరికత వరాల జల్లు కురిసి
రంగుల సిమెంటు పూలు
విరగబూసాయి  వాటి మధ్య
ఆధునికత భయం లేకుండా
ఆకాశాన్ని తాకేలా

మోరలెత్తుకొని
ఆ వృక్షరాజాలు ధైర్యంగా
నిలబడ్డాయి ! కారణం ..
గతానికి వర్తమానానికి మధ్య
ఏ ఆధునికత
చొరబడలేని వారధులు సారథులు
అవే కాబట్టి !
ధనాన్ని మించింది పచ్చదనం
ఆధునికతని మించింది
ఆరోగ్యం
పార్కులో ఎన్ని ఆధునిక
హంగులు
ఆర్భాటాలు వున్నా వచ్చే
వాళ్లని ఆకర్షించి
వెన్నుకాచి రక్షించే చల్లదనాల కోట ఆ
పచ్చసైన్యమే!

**- భీమవరపు పురుషోత్తమ్**



# ప్రాణం

అసమాన్యమైనది
కవచం లా తోలు
కప్పుకున్న ఆకారం చూపేది
గాలితో స్నేహం చేస్తుంది
ప్రకృతితో పెనవేసుకుంటుంది
జాతి విస్తరణకు
సృష్టిని కొనసాగిస్తుంది
ఇలలో ప్రేమకు గుర్తుగా
భూమిక పోషిస్తుంది

**- తుమ్మ రాజా**

# ఆశల ఆకాశమే ఆమె

ఆమె జీవితంలో
తెలవారని తూరుపులు
అస్తమించని పశ్చిమాలెన్నో!
చెంపల జారిన కన్నీటి చుక్కలు
ఎన్ని పొద్దులు ముంగిట
ముగ్గులయ్యాయో !
పగలంతా పరుగులు
రేయంతా జాగారాలు ..
వాలిన కళ్ళు
రెప్పల కింద జ్ఞాపకాలు
ఓడిన ఆశలు
సాధించని ఆశయాలు
తానోడినా తనవారిని
గెలిపించే ధన్యజీవే ఇల్లాలు.

**- జయసుధ కోసూరి**

# అంతరాత్మ

హిమగిరి సొగసుల
అందం చూసినా
ఆ భావన లేదు
వికసించిన పూవుల
సొగసు కళ్ల ముందు ఉన్నా
ఆ ఆస్వాదన రాలేదు
ఎందుకనో
విప్పారిన ప్రకృతి
తనలోకి ఆహ్వానం
పలికినా
స్పందన నిర్లప్తం
విస్తారంగా
విస్తరించి వున్న
అధోజగత్ సోదరుల
ఆర్తనాదాలు
ప్రకంపనలు రేపుతున్నాయి
మురికితనపు
జీవితాలు జీవనాలు
కల్లోల భరితంగా
మారినందుకో ఏమో
మరే విధమైన
ఆనందుకో ఏమో
మరే విధమైన
ఆనందాలకు ఆహ్లాదాలకు
బహు దూరంగా
జరిగిన అంతరాత్మ
కుత్తుకను కత్తిరించలేక
మధన పడుతూ
అదే ఆవేదనను
అనుభవిస్తూ
వంచనా శిల్పాన్ని
రూపు దిద్దలేక
అలా శూన్యంలోకి
చూస్తూ  నేను..

**- పంతంగి శ్రీనివాస రావు**

# 'మనిషి' ముఖ చిత్రం

జీవిస్తున్నామనుకోవడమేగాని
బతకడం ఎప్పుడో మర్చిపోయాం
ఆప్యాయతల జాడల్లేవ్.. అభిమానపు
నీడల్లేవ్
'నట్టింట్లో' డాలర్ల స్వర్గం కోసం ఆగని
ఛాటింగ్స్
అంతులేని మీటింగ్స్ వెనుక అర్థంకాని
ఛీటింగ్స్
ఏ వెబ్‌సైట్‌లోనూ కనిపించదు పాపభీతి
ప్రేమ పరిమళాలు అంటని రెడీమేడ్
జంక్షన్‌లో
మానవత్వం ఏనాడో జామ్
అయిపోయింది
విలాసాల విల్లాల కోసం, ఊళ్లో కళ్లాలు
మాయం
అసలు పొలం ఉంటేగా, గట్టు మీద
పలకరింపులు
రంగవల్లుల ఊసులేదు.. గొబ్బెమ్మల
ధ్యాస లేదు
సాంప్రదాయపు సంస్కృతి పొలిమరలు
దాటి చాలాకాలమైంది
అంతా డబ్బు మయం
అంతా జబ్బుమయం
కృత్రిమత్వం మోజులో సహజత్వం
చచ్చిపోయింది
ఇక బతికినన్నాళ్ళూ చావడమే..
చావొచ్చే వరకూ బతకడమే.

**- 'ధరణికోట' శివరామప్రసాద్**



ఎండల్లో మనందరికీ చటుక్కున గుర్తొచ్చేది కూల్‌డ్రింక్. కానీ అవి ఆరోగ్యానికి అంత మంచివి కావని నిపుణులు చెబుతుండటం తెలిసిందే. అందువల్ల వాటి జోలికి వెళ్లకపోవడం మంచిది. నిజానికి శీతల పానీయాలు ఇంట్లోనే చేసుకోవచ్చు.

# వేసవి శీతలాలు ..

## నారింజ



**కావలసినవి :** నారింజ పండ్లు-20, పంచదార- మూడు కప్పులు. **తయారీ :** నారింజపండ్ల తొక్క, గింజలూ కూడా తీసే యాలి. తొనలను గ్రైండ్ చేసి రసాన్ని వడకట్టాలి. నాలుగు కప్పుల నీళ్లలో పంచదార వేసి మరిగించాలి. అందులో నారింజ రసం వేసి ఉడికించాలి. చిక్కగా అయ్యాక దించేసి చల్లారనివ్వాలి. దీన్ని గాలి చొరబడని సీసాలో పోసి ఫ్రిజ్‌లో భద్రపరచుకోవాలి. ఒక వంతు పానీయానికి రెండొంతులు నీళ్లు, రెండు మూడు ఐస్ క్యూబ్స్ జోడించి, చల్లని నారింజరసాన్ని ఆస్వాదించండి.

## యాపిల్

**కావలసినవి :** యాపిల్స్-18, పంచదార-పావు కిలో, దాల్చిన చెక్కపొడి- పావు చెంచా

**తయారీ :** యాపిల్స్ ను కడిగి, గింజలు తీసేసి ముక్కలుగా కోయాలి. చెక్కు తీయనవసరం లేదు. అందులో అరలీటరు నీళ్లు పోసి.. సన్న సెగ మీద 20 నుంచి 25 నిమిషాలు ఉడికించాలి. ఈ రసాన్ని వడకట్టి, పంచదార, దాల్చిన చెక్క జతచేసి మరో ఐదు నిమిషాలు తెర్లించాలి. చల్లారాక ఫ్రిజ్‌లో ఉంచి, తాగేటప్పుడు పల్చన చేసుకుంటే సరిపోతుంది.



## పుచ్చకాయ

**కావలసినవి :** పుచ్చకాయ- ఒకటి, పంచదార-2 కప్పులు, నిమ్మరసం-2 స్పూన్లు , యాపిల్ గుజ్జు-అర కప్పు, రేగుపండ్లు - పావు కప్పు.

**తయారీ :** పచ్చకాయను సగానికి కోసి విత్తనాలు తీసేసి స్పూన్‌తో ఎర్రటి గుజ్జును తీయాలి. రేగుపండ్లు కడిగి, గింజలుర తీసేయాలి. వీటికి యాపిల్ గుజ్జు చేర్చాలి. ఈ మూడు రకాల పండ్లనూ మందపాటి గిన్నెలో వేసి, మునిగే వరకూ నీళ్లు పోయాలి. అందులో పంచదార వేసి.. సన్నసెగ మీద సుమారు పావు గంట సేపు ఉడికించాలి. చల్లారిన తర్వాత నిమ్మరసం కలిపి, ఫ్రిజ్‌లో భద్రం చేసుకోవాలి. ఒక వంతుకు మూడొంతుల నీళ్లు కలిపి తియ్యతియ్యగా ఆస్వాదించండి.



## మామిడి

**కావలసినవి :** మామిడిపండ్లు పెద్దవి-6, పంచదార- రెండు కప్పు, నిమ్మరసం- రెండు చెంచాలు

**తయారీ :**



మామిడి పండ్ల చెక్కు తీసి ముక్కలు కోసి, గ్రైండ్ చేయాలి. మందపాటి గిన్నెలో 4 కప్పుల నీళ్ల. పంచదార వేసి.. సన్నసెగ మీద తెర్లించి, దించేయాలి. చల్లారిన తర్వాత మామిడిపండ్ల గుజ్జు, నిమ్మరసం వేసి కలపాలి. ఈ చిక్కటి రసాన్ని శుభ్రమైన సీసాలో పోసి ఫ్రిజ్‌లో ఉంచాలి. గ్లాసులో ఒక వంతు పానీయానికి మూడొంతుల నీళ్లు కలిపి తాగితే.. ఏ కూల్‌డ్రింకూ సాటిరాదనిపిస్తుంది.

# మరుగుజ్జుత్వం దేహానికి కానీ ప్రతిభకు కాదు!

**మరుగుజ్జుత్వం దేహానికి మాత్రమే కానీ తనలో దాగి ఉన్న ప్రతిభకు కాదని ప్రత్యక్షంగా నిరూపించాడు డాక్టర్ గణేష్ బరైయా. 23 ఏళ్ల గణేష్ బరైయా తన మరుగుజ్జుత్వం కారణంగా వివక్షను ఎదుర్కొన్నప్పటికీ ప్రపంచంలోనే అత్యంత పొట్టి వైద్యుడిగా చరిత్ర సృష్టించాడు.**

**యేచన్ చంద్ర శేఖర్**

గుజరాత్‌లోని తలజా తాలూకా, భావనగర్ జిల్లాలో సాధారణ రైతు కుటుంబంలో జన్మించిన గణేష్ బరైయా చాలా చిన్న వయస్సు నుండే కష్టాలను ఎదుర్కొన్నాడు. అతను సాధారణ బాలుడిగా జన్మించినప్పటికీ నాలుగు సంవత్సరాల వయస్సులో, అతని తల శరీరం కంటే అధిక పరిమాణంలో పెరగడాన్ని తల్లిదండ్రులు విఠల్ మరియు దేవుబెన్ గమనించారు. ఇందుకు వారు అతన్ని వైద్యుడి వద్దకు తీసుకెళ్లగా, ఆ బాలుడు నయం చేయలేని వ్యాధితో బాధపడుతున్నాడని తెలపడంతో వారు చాలా బాధ పడ్డారు. అతని శారీరక సవాళ్లు ప్రత్యేకించి మరుగుజ్జుత్వం కారణంగా వచ్చాయి. దీని ఫలితంగా అతని శరీరంలో 72 శాతం లోకోమోటివ్ వైకల్యం కూడా ఏర్పడింది. గణేష్ కూడా తన తోటి పిల్లల లాగా ఎదగాలని భావించిన దేవుబెన్ అతని తలపై టబ్ లాంటి హెల్మెట్‌ను ఉంచి, అది పెరగకుండా నిరోధించి, అతని శరీరం దానిని తట్టుకునే అవకాశం కల్పించే ప్రయత్నం చేసింది. అతను పెద్ద తలతో పొట్టిగా మరుగుజ్జుగా ఉండడంతో పాఠశాలలో తరచుగా విద్యార్థులు అతడిని ఎగతాళి చేసేవారు. అయినప్పటికీ ఆయన అవహేళనలను ఏమాత్రం ఖాతరు చేయకుండా తన చదువుపై దృష్టి పెట్టి శ్రద్ధగా చదివే వాడు. అతనికి 10వ తరగతి దాటి చదవని వివాహితులైన ఏడుగురు సోదరీమణులు మరియు ఒక సోదరుడు ఉన్నారు. ఆ కుటుంబంలో కళాశాలకు హాజరైన మొదటి వ్యక్తి గణేష్ కావడం విశేషం. అయినప్పటికీ, అతను ప్రపంచాన్ని, ప్రతికూలతలను తన చిరునవ్వుతో ఎదుర్కొంటాడు. మృదువుగా చిన్నపిల్లల్లా ఉండే అతని స్వరం, అతను ప్రదర్శించే ఆత్మవిశ్వాసం స్థితి స్థాపకతకు భిన్నంగా ఉంటుంది.



### సవాళ్ళను అధిగమించి ...

శారీరక మరియు పలు ఇతర సవాళ్లు ఉన్నప్పటికీ, ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని, ప్రణాళికాబద్ధంగా ఉత్సాహంతో కష్టపడి పనిచేస్తే ఏదైనా సాధించవచ్చు అనడానికి గణేష్ బరైయా ఒక ప్రత్యక్ష ఉదాహరణ. అంతేకాదు, తన మరుగుజ్జుత్వం కారణంగా 3 అడుగుల 4 అంగుళాల పొడుగుతో, 18 కిలోల బరువుతో ప్రపంచంలోనే అత్యంత పొట్టి వైద్యుడిగా ఆయన గిన్నిస్ ప్రపంచ రికార్డ్ సృష్టించాడు. సాధారణ రైతుగా పనిచేస్తూ రోజుకు కేవలం రూ. 200 సంపాదించే గణేష్ తండ్రి విఠల్ భాయ్ వద్దకు ఒక సర్కస్ కంపెనీ వారు వచ్చి గణేష్‌ను సర్కస్‌లో విదూషకుడిగా పనిచేసేందుకు పంపితే రూ. 1,200 (వెయ్యి డాలర్లు) ఇస్తామని ఆశ చూపారు. దీంతో ఆ తండ్రి తన కొడుకు భద్రత పట్ల తీవ్ర ఆందోళనకు గురయ్యాడు. గణేష్‌ను ఎవరైనా కిడ్నాప్ చేస్తారేమో అని భయపడి ప్రతి రోజు తానే స్వయంగా గణేష్‌ను పాఠశాల వద్ద దింపడం మరియు తీసుకురావడం చేసేవాడు. బడి నుండి వచ్చిన తరువాత కూడా గణేష్ ఎక్కడికీ వెళ్లకుండా గట్టి నిఘా ఉంచేవాడు. శారీరక పరిమితులు ఉన్నప్పటికీ, జీవితంలో ప్రతిష్టాకరమైనది ఏదైనా సాధించాలనే తపన ఆయనలో ఎప్పుడూ ఉండేది. బాల్యం నుండే డాక్టర్ కావాలనే కలలు కన్న గణేష్ బరైయా తన శక్తినంతా చదువుపై కేంద్రీకరించి అధిక మార్కులు సాధించేందుకు శ్రమించేవాడు. ఎట్టకేలకు తన సుదీర్ఘ కృషి ఫలించి సరైన సమయం రావడంతో, అతను బ్యాచిలర్ ఆఫ్ మెడిసిన్ మరియు బ్యాచిలర్ ఆఫ్ సర్జరీ డిగ్రీ (ఎంబిబిఎస్) కోసం దరఖాస్తు చేసుకున్నాడు. తన ప్రారంభ పోరాటాలను గుర్తుచేసుకుంటూ, నేను 12వ తరగతిలో 87 శాతం మార్కులతో ఉత్తీర్ణుడై నీట్ (వైద్య విద్య కోసం దేశ వ్యాప్తంగా నిర్వహించే ప్రవేశ పరీక్ష)లో 233 మార్కులు సాధించి అద్భుతమైన ప్రతిభను కనబర్చినప్పటికీ, మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎంసిఐ), నా ఎత్తు కేవలం మూడు అడుగులు మాత్రమేనని, అత్యవసర సందర్భాల్లో విధులను నిర్వర్తించడానికి ఇది ప్రతిబంధకంగా మారుతుంది అన్న కారణంతో నా దరఖాస్తుతో పాటు మరో ఇద్దరు విద్యార్థుల దరఖాస్తులను తిరస్కరించింది" అని తెలిపాడు.

### న్యాయపోరాటం ..

ప్రతిభ ఉండి కూడా, శారీరక పరిమితులను కారణంగా చూపుతూ మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎంసిఐ) తన అభ్యర్థిత్వాన్ని తిరస్కరించడాన్ని గణేష్ బరైయా ఒక సవాలుగా స్వీకరించాడు తప్ప వైద్య విద్య చదవాలన్న తన నిర్ణయాన్ని ఉపసంహరించుకునేందుకు ఏమాత్రం సిద్ధపడలేదు. ఈ ఉదంతం ఆయనలో పట్టుదలను మరింత పెంచింది. అతను నీలకంఠ విద్యాపీఠంలోని తన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ దల్పత్ భాయ్ కటారియా మరియు రేవాసిష్ బరైయా సలహా మేరకు భావ్‌నగర్ కలెక్టర్ మరియు గుజరాత్ విద్యా మంత్రిని కలిసాడు. కలెక్టర్ సలహాననుసరించి తన వైద్య విద్య హక్కు కోసం ఆయన చివరికి గుజరాత్ హైకోర్టును ఆశ్రయించాడు. దురదృష్టవశాత్తు గుజరాత్ హైకోర్టులో కేసు ఓడిపోయినప్పటికీ, అతను ఏ మాత్రం నిరుత్సాహపడకుండా, సుప్రీంకోర్టు తలుపు తట్టాడు. సుదీర్ఘ పోరాటం తర్వాత సుప్రీంకోర్టు ఆయన పక్షంలో తీర్పునిస్తూ వచ్చే విద్యా సంవత్సరం (2019) నుండి మరోసారి నీట్ ప్రవేశ పరీక్ష

రాయాల్సిన అవసరం లేకుండా ఆయన ఎంబిబిఎస్ కోర్సులో చేరవచ్చుని, అందుకోసం ప్రభుత్వం గణేష్‌కు ఒక సీటు ప్రత్యేకంగా రిజర్వ్ చేయాలని ఆదేశించింది. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గణేష్ బరైయా 2019లో ఎంబిబిఎస్‌లో అడ్మిషన్ పొంది కోర్సు పూర్తి చేసి ప్రస్తుతం భావ్‌నగర్‌లోని సర్‌టి ఆసుపత్రిలో ఇంటర్న్‌గా పనిచేస్తున్నాడు. తాను చిన్నప్పటి నుండి ఎంతో ఆర్తిగా కంటున్న కలను సాకారం చేసుకునే దిశలో కొనసాగుతున్నానని డా.గణేష్ బరైయా సంతృప్తిని వ్యక్తపరుస్తాడు. నేను భిన్నంగా ఉన్నాననే విషయం నాకు తెలుసు. కానీ, నేను కూడా ఇతరుల మాదిరిగానే మంచి జీవితాన్ని గడపాలని మరియు నా తల్లిదండ్రులను గర్వపడేలా చేయాలనుకుంటున్నాను" అని అంటాడు. ఇది అతని పట్టుదల మరియు స్థితిస్థాపకతకు నిదర్శనం. డాక్టర్ గణేష్ బరైయా ఇప్పటికీ వివక్షతను ఎదుర్కొంటున్నాడు. సాధారణంగా రోగులను పరీక్షించడానికి ఆయన వారి వద్దకు వచ్చినప్పుడు రోగులలో చాలామంది ఎత్తు కారణంగా అతనితో మాట్లాడటానికి అయిష్టత ప్రదర్శిస్తారు. కానీ చిరునవ్వుతో కూడిన ఆయన ప్రశాంత వదనంతో పాటు వైద్య వృత్తిలో ఆయనకు గల నైపుణ్యం పట్ల వారికి కొంత నమ్మకం ఏర్పడిన తరువాత వారు ఆయనతో ఎలాంటి సంకోచం లేకుండా సఖ్యతగా వ్యవహరిస్తారు. ప్రపంచంలోనే అత్యంత పొట్టి వైద్యునిగా గిన్నిస్ ప్రపంచ రికార్డు నెలకొల్పిన డా.గణేష్ బరైయా జూలై 1, 2024న తిరువనంతపురంలోని ఎస్ పి మెడిఫోర్ట్ హాస్పిటల్‌లో డాక్టర్స్ డే వేడుకల్లో భాగంగా నిర్వహించిన షాడో డాక్టర్ 2.0 కార్యక్రమ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై అందరి మన్ననలు అందుకున్నారు.

**ప్రేరణ ఇలా లభించింది ...**

ఉన్నత పాఠశాలలో చదువుతున్నప్పుడు, అతని ఉపాధ్యాయులు మరియు ప్రిన్సిపాల్ అతన్ని వైద్య వృత్తి చేపట్టమని ప్రోత్సహించారు. పట్టుదలతో వైద్య విద్యను అభ్యసించడం ద్వారా అతను ఇతరులకు ప్రేరణగా నిలవగలడని వారు అతనిలో ఆత్మవిశ్వాసం పాదుకొల్పారు. అంతేకాదు, అతనికి చాలా మంది ఆదర్శప్రాయులు కూడా ఉన్నారు. 2018లో



యూనియన్ పబ్లిక్ సర్వీస్ పరీక్షలో 570వ ర్యాంకుతో, 22 ఏళ్లకే భారతదేశంలోనే అతి పిన్న వయసులో ఐపీఎస్ సాధించిన సఫిన్ హసన్ మరియు 2014లో యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షలో అగ్రస్థానంలో నిలిచి, అఖిల భారత స్థాయిలో 1వ ర్యాంకుతో ఐఏఎస్ సాధించిన మొదటి



శారీరక వైకల్యం కలిగిన మహిళ ఇరా సింఘాల్‌లు ఆయనకు స్ఫూర్తిప్రదాతలు. డాక్టర్ కావడంతోనే గణేష్ బరైయా సవాళ్లు ముగిసిపోలేదు. అతను తన మరుగుజ్జుత్వాన్ని తట్టుకుంటూనే వైద్య రంగంలో ఎలా పని చేయాలో నేర్చుకోవాల్సి వచ్చింది. అతని సహచరులు మొదటి నుంచీ అతనితో కలిసి పనిచేయడానికి ఎల్లవేళలా ఉత్సాహంగా తమ పూర్తి తోడ్పాటునందిస్తున్నారు. పని చేస్తున్నప్పుడు ఆచరణాత్మక ఇబ్బందులను అధిగమించడానికి అతనికి అనుకూలంగా ఉండేందుకు వారు ఒక ఎత్తైన కుర్చీని ఏర్పాటు చేయడంతో పాటు కొన్ని సృజనాత్మక పరిష్కారాలను అభివృద్ధి చేశారు. శారీరక ఎత్తు అనేది గొప్పతనాన్ని సాధించే సామర్థ్యాన్ని నిర్ణయించజాలదని అందుకు అతని జీవితమే ఒక ప్రత్యక్ష ఉదాహరణగా నిలుస్తుంది. మొక్కవోని ధైర్యంతో అతను సాధించిన విజయాలు మరియు వృత్తి పట్ల అతని అంకితభావం, ప్రతికూల పరిస్థితులకు జడిసి లక్ష్యసాధనలో వెనుకంజ వేసే ప్రతి విద్యార్థికి, వారి కలలను సాకారం చేసుకునేందుకు ప్రేరణగా నిలుస్తుందనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు.

**ఫ్రీ బీయింగ్ మీ ...**

ఈ ప్రపంచంలో ఏ ఒక్కరు కూడా తమ బాహ్య శారీరక రూపం (ఛాయ, ఒడ్డు, పొడుగు, పొట్టి, లావు, సన్నం), కుటుంబ, సామాజిక, ఆర్థిక, కుల, మత నేపథ్యాలతో సంబంధం లేకుండా, ఎలాంటి ఆందోళనలకు గురికాకుండా సంతోషంగా జీవించే పరిస్థితులను నెలకొల్పే లక్ష్యంతో వరల్డ్ అసోసియేషన్ ఆఫ్ గర్ల్ గైడ్స్ అండ్ గర్ల్ స్కౌట్స్ – వాగ్స్ అనే చొరవను ప్రారంభించింది. 2013లో ఈ చొరవను ప్రారంభించిన నాటి నుండి తమ శరీర విశ్వాసం మరియు ఆత్మ గౌరవాన్ని మెరుగుపరచుకోవడానికి దాదాపు 6.5 మిలియన్లకు పైగా యువతకు మద్దతు అందివ్వడంతో పాటు 2025 చివరి నాటికి మరో 3 మిలియన్ల మందిపై ఇది ప్రభావంచూపనుంది. వాయువేగంతో పోటీ పడుతూ పరిగెడుతున్న నేటి ప్రపంచంలో, జీవితంలో ఎదురయ్యే సవాళ్ళను ఎదుర్కోవడంలో కొందరు యువకులు చతికిలబడడం, మరి కొందరు ప్రతి చిన్న విషయానికి ఆందోళనకు గురై తమ ప్రాణాల పైకి తెచ్చుకోవడం మనం చూస్తూనే ఉన్నాము. అలాంటి వారు, శారీరక వైకల్యాన్ని ఆత్మవిశ్వాసంతో అధిగమించి డా గణేష్ బరైయా సాధించిన విజయాలను స్ఫూర్తిగా తీసుకుని తమ లక్ష్యసాధనలో ముందుకు వెళ్ళాలని కోరుకుందాం.

# గుంటనక్క - గుడ్లగూబ


కథ

అనగనగా ఒక అడవి.ఆ అడవిలో ఒక గుంట నక్క ఆకలితో సంచరిస్తోంది. అలా తిరుగుతూ ఉండగా ఒక చెట్టు మొద్దుపై గుడ్లగూబ కూర్చుని ఉండటం చూసింది గుంట నక్క. దాన్ని పట్టుకుని తినాలని నక్కకు నోరూరసాగింది. గుడ్లగూబతో వేగడం కష్టం దాన్ని పట్టుకుని తినబోతుంటే గోళ్లతో రక్కుతుందేమో? ఒంటికి గాయాలవుతాయని భయపడింది. ఇంతలో నక్కకి ఒక ఉపాయం తోచింది. గుడ్లగూబతో ఇలా అంది. మిత్రమా! ఇచట ఒక ప్రాంతంలో ఒక పాడుబడ్డ బంగ్లా ఉంది. ఆ బంగ్లాలో చాలా ఎలుకలు సంచరిస్తూ ఉంటాయి. నీకు ఆ గదిని చూపిస్తాను. ప్రతిరోజు షికారుకు నీకు వ్యయ ప్రాయాసలు పడకుండా ఒక నెల రోజులపాటు ఎంచక్కా ఎలుకలను పుష్టిగా భుజించవచ్చు అంది నక్క. అదేంటో ఆలస్యం చేయకుండా చెప్పమంది గుడ్లగూబ. అదిగో! ఆ మామిడి చెట్టును చూసావా? దానిపై ఒక అందమైన చిలుక ఉంది. చాలా రోజులుగా దానిని భుజించాలని నాకు చాలా ఆశగా ఉంది. కానీ ఆ చిలుక నాకు చిక్కడం లేదు. నువ్వు ఏం చేస్తావో? ఎలాంటి ఉపాయం పన్నుతావో? నాకు తెలియదు. కానీ ఆ చిలుకను నాకు అప్పగించాలి. నువ్వు అందుకు అంగీకరిస్తేనే ఆ పాడుబడ్డ ఎలుకల బంగ్లాను నీకు చూపిస్తాను అంది. అందుకు గుడ్లగూబ సరేనని నక్క షరతుకు అంగీకరించింది. ఎలాగైనా మాయ మాటలు చెప్పి చిలకను నక్క దగ్గరికి తీసుకెళ్లాలని అనుకుంది. వెంటనే చిలుక ఉండే మామిడి కొమ్మపై వాలింది. నక్క గుడ్లగూబను అనుసరిస్తూ ఆ చెట్టు చాటున నక్కింది. గుడ్లగూబ చిలుక దగ్గరికి వెళ్లి ఏవో మాయ మాటలు చెప్పసాగింది. చిలుక చాలా తెలివైంది. ఈ గుడ్లగూబ ఇంత చక్కగా మాట్లాడుతుంది అంటే ఏదో మర్మం ఉంది ఇదేదో పన్నాగమే పన్ని ఉంటుంది. దీని మాయమాటలు నమ్మవద్దు అని చిలుక ముందుగానే జాగ్రత్త పడింది. చిలుకా! నువ్వు చాలా అందంగా ఉంటావు. చక్కనైన పలుకులు పలుకుతావు. ఆ ఎర్రని ముక్కు నీ ముఖానికే అందం అంటూ పొగడ్తలతో ముంచెత్తింది. అప్పుడు చిలుక ఇలా అంది. అయ్యో గుడ్లగూబ నాది ఎంత అందమైనా నా అంత అందం కాదులే. నువ్వేమో పాలమీగడలా తెల్లగా మిలమిలా మెరిసిపోతావు. అందమైన నీ ముఖానికి తగ్గట్లుగా పెద్దపెద్ద చక్రాల్లాంటి కళ్లు. నిజంగా నా కంటే నువ్వే చాలా అందంగా ఉంటావు అంది చిలుక. ఆ వెంటనే మిత్రమా! నిన్ను ఒక్క మాట అడగనా? అంది చిలుక గుడ్లగూబ వంక చూస్తూ. దానికేముంది అడుగు మిత్రమా అంది గుడ్లగూబ. ఏం లేదు నువ్వు చాలా ముద్దొస్తున్నావ్. నాకు నిన్ను ఒక్కసారి ముద్దుపెట్టుకోవాలని ఉంది. ఏమంటావ్ అంది చిలుక. అందుకు గుడ్లగూబ పొంగిపోయి సరే ముద్దు పెట్టుకో అంది చిలుకను. అప్పుడు చిలుక గుడ్లగూబ ముఖంపై వాలి ముద్దెట్టుకున్నట్లు నటిస్తూ ఒక్క ఉదుటున గుడ్లగూబను కిందకి తోసింది. గుడ్లగూబ దబాలున కిందపడిపోయింది. ఇంకేముంది గుంటనక్క గుడ్లగూబను గబుక్కున పట్టుకుని నోటితో కరుచుకుని పారిపోయింది. 'నీతి' ఒకరిని మోసం చేయాలని చూస్తే, మోసపోక తప్పదు.



**- అరుణ బట్టువార్**

## దారిచూపండి!







## బాలగేయం

### ఎండాకాలం వచ్చింది

ఎండాకాలం
వచ్చిందంట
ఎండ వేడిమి
పెరిగిందంట
నెత్తి చుర చుర
కాలిందంట
గొంతులో తడి
ఆరిందంట
మంచి నీరు తాగాలంట
చెట్టు నీడకు వెళ్లాలంట
చల్లని గాలిలో
ఉండాలంట
పలుచటి
దుస్తులేయాలంట
ఇంటిపట్టునే ఉండాలంట
దుమ్ము ధూళికి
వెళ్లకుండా
దూరం దూరం
జరగాలంట
ఆట పాటలు
చల్లని వేళలో
కమ్మగా ఆడుకోవాలంట
గోరు వెచ్చని నీళ్ల తోటి
రోజు స్నానం
చేయాలంట
వేసవి తాపం
వచ్చిందంట జాగ్రత్తలను
పాటించాలంట

- నరెద్దుల రాజారెడ్డి



## హలో ఫ్రెండ్...

**చిన్నారుల ప్రశ్నలకు**
**వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్**

### గిరీష్ అంకుల్ సమాధానాలు

- పి.సంధ్యారాణి, కడప


**ప్రశ్న:** మందుల ఎక్స్‌పైరీ డేట్‌లను ఏ విధంగా నిర్ణయిస్తారు?

**జవాబు:** అలోపతి మందులన్నీ రసాయనాలతో కూడినవే. ఈ రసాయనాలు కాలానుగుణంగా ప్రకృతి సహజ చర్యలకు లోబడి తమ లక్షణాలను క్రమంగా కోల్పోవడమూ సహజమే. మందులలో ఒకే రసాయనం ఉండదు. పలురకాల రసాయనాల మిశ్రమంతో కూడి ఉండటంతో రకరకాల చర్యలకు గురవుతాయి. తమ సహజ లక్షణాలను కోల్పోయి నిస్తేజమవుతాయి. మిశ్రమాలలో ఉన్న కొన్ని రసాయనాలు విషపూరితమవుతాయి. ఆ సందర్భంలో ఆ మందు వాడిన వారికి ప్రాణాంతకంగా అవి పరిణమించే అవకాశం ఉంది. ఆయా ఔషధాలలో వాడిన పలు రసాయనాలు, వాటి లక్షణాలు, అవి ఎంతకాలంలో రసాయనికచర్యలకు లోబడి, ఎటువంటి మార్పులకు లోనవుతాయి మొదలైన అంశాలన్ని పరిశోధనలు చేసిన శాస్త్రవేత్తల ఆధారంగానే ఆయా మందులు ఎంతకాలం లోపుగా వాడితే సురక్షితమో తెలియపరచడానికి ఎక్స్‌పైరీ డేట్‌ను నిర్ణయించి ఆయా మందుల మీద ముద్రిస్తారు.

- ఎన్.సతీశ్, చిత్తూరు

**ప్రశ్న:** హిమాలయాల్లోని ఎత్తయిన పర్వత శిఖాలు ఏ కాలంలో ఏర్పడాయి?

**జవాబు:** హిమాలయాల్లోని పర్వతాలు సుమారుగా 60 మిలియన్ సంవత్సరాల కిందట ఆవిర్భవించడం మొదటుపెట్టాయి. హిమాలయాల్లోని అత్యంత ఎత్తయిన పర్వత శిఖరాలతో కూడి గ్రేటర్ హిమాలయాలు మాత్రం 20-25 మిలియన్ సంవత్సరాల కిందటే ఆవిర్భవించాయి. నేటికీ ఎంతోకొంత కొద్దిస్థాయిలోనైనా హిమాలయాల లోని పర్వతాల సంఖ్య పెరుగుతూనే ఉందని చెప్పాలి.







బాంబులకు బెదనవి. బుల్లెట్లకి భయపడనివి. గడ్డకట్టే చలి ఉన్నా కాస్త కూడా వణకవి. ఏమన్నా ఉన్నాయంటే అవి 'మ్యూల్ రోబోలే' అని భారతీయ సైన్యానికి బాసటగా ఉంటున్నాయంటే నమ్మండి. భూమికి వేల అడుగుల ఎత్తులో ఉన్న పర్వతాలనీ యుద్ధ స్థావరాలనీ సునాయాసంగా చేరుకుని శత్రువుల గుండెల్లో గుబులు పుట్టిస్తాయి. భారత సైన్యంలోకి కొత్తగా చేరిన 'మ్యూల్' రోబో దళం గొప్పతనం గురించే. తెలుసుకున్నాం వాటికంత గుండెధైర్యం ఎలా వచ్చిందో చూద్దాం.



# సైన్యానికి బాసట 'మ్యూల్' రోబో

మన భారత సైనికులకి సరిహద్దుల్లోని శత్రువులతో యుద్ధం చేయడం ఒకెత్తయితే... భూమికి 20వేల అడుగుల ఎత్తులో ఉన్న సియాచిన్ లాంటి హిమాలయ పర్వతప్రాంతాల్లోని కఠినమైన వాతావరణ పరిస్థితులతో యుద్ధం చేయడం మరొఎత్తు, అంత ఎత్తుకి వాహనాలు కానీ, హెలికాప్టర్లు కానీ చేరుకోలేవు. మరి అంతవరకూ వెళ్లి... మన కోసం పోరాడుతున్న సైనికులకి ఆహారమూ, ఆయుధాలూ, మందులూ అందించేదెవరు? ఈ పనులతోపాటూ.. అవసరమైతే యుద్ధం కూడా చేసే ఆధునిక సాంకేతిక సైనిక దళమే 'మ్యూల్' మ్యూల్ అంటే మల్టీ యుటిలిటీ లెగ్డ్ ఎక్విప్మెంట్ అని అర్థం. ఇవి చూడ్డానికి నాలుగు కాళ్లతో ఉండి... కుక్కలని పోలిన రోబోలు. ఏఐ పరిజ్ఞానంతో పనిచేస్తాయి. మైనస్ 40 డిగ్రీ చలి నుంచి 50 డిగ్రీల ఎండ వరకు ఎలాంటి ప్రతికూల వాతావరణాన్ని తట్టుకుంటాయి. నిటారుగా ఉండే పర్వతాలూ, వేగంగా ప్రవహించే సెలయేళ్లూ, అగ్ని ప్రమాదాలూ ఏవీ... గమ్యాన్ని చేరుకోకుండా వీటిని అడ్డు కోలేవు. వీటి బరువు 50 కేజీలుంటే.. వీపున మరో 15 కేజీల బరువుండే ఆహారమూ, మందులూ, ఆయుధాలూ వంటివాటిని తీసుకెళ్లి సైనికులకి అందజేస్తాయి. దారిలో బాంబులు పేలిన బెదరవు. మందు పాతరలని ముందుగానే పసిగట్టేందుకు వీటి దగ్గర ప్రత్యేకమైన సెన్సర్లూ, థెర్మల్లూ ఉన్నాయి. రోజంతా నిర్విరామంగా పనిచేస్తాయి. పుణెలో

ఈ మధ్యే జరిగిన 77వ ఆర్మీ పరేడ్‌లో భారత సైన్యం... ఈ రోబో డాగ్స్ ప్రత్యేక కవాతు చేయించి అందరి దృష్టినీ ఆకర్షించింది. ఆ తర్వాతే ఈ మ్యూల్ రోబో దళం గురించి ప్రపంచానికి తెలిసింది. చైనా తర్వాత ఆధునిక సాంకేతిక నైపుణ్యాలున్న రోబో దళం మనకే ఉందట. ఢిల్లీకి చెందిన రోబోటిక్స్ సంస్థ ఏరో ఆర్క్ వీటిని రూపొందించింది. వీటి తయారీ వెనుక ఓ ఆసక్తికరమైన విషయం ఉంది. అదేంటంటే...



### శునకాల స్ఫూర్తితోనే...

ఈ రోబోలు చూడడానికి కుక్కల్లా ఉన్నాయ్, వీటిని మ్యూల్స్ అని ఎందుకు అంటున్నారు.. అనే అనుమానం రావొచ్చు. అదీ నిజమే, ప్రపంచంలో ఎక్కడైనా ఈ తరహా రోబోలని 'రోబో డాగ్స్' అనే పిలుస్తున్నారు.



కానీ ఇక్కడ మాత్రం ఇలా పిలవడానికి కారణం.. కంచర గాడిదలు. ఆశ్చర్యంగా ఉండొచ్చు.. కానీ నిజం, గుర్రాలకీ, గాడిదలకీ పుట్టిన వాటిని కంచరగాడిదలని అంటారు. వీటిని ఇంగ్లీషులో మ్యూల్స్ అంటారు. 75 ఏళ్లుగా భారత సైన్యానికి ఇవే ప్రాణాలకు తెగించి మరీ సేవలు అందిస్తున్నాయి.

ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, హరియాణా, మధ్యప్రదేశ్‌లో ప్రత్యేకంగా వీటికోసం సైనిక శిక్షణ కేంద్రాలు ఉన్నాయి. వీటికి రెండేళ్ల వయసు నుంచే ఇక్కడబాంబులకు బెదరకుండా యుద్ధ శిబిరాలకు చేరుకోవడంలో శిక్షణ ఇస్తారు. అలా..

ఇవి రెండు ప్రపంచ యుద్ధ సమయాల్లోనే కాదు, కార్గిల్ యుద్ధంలోనూ కీలక సేవలు అందించాయి. పనితీరును బట్టి అధికారులు వీటికి పేర్లుపెట్టి... కాలూ, చోటా, తేజ్, గోలూ, బోలా, దబాంగ్, బందూక్ సింగ్, శక్తిమాన్, షేక్ చిలీ, మజ్నూ అని పిలుస్తారు. వీటిలో 'పెడోంగి' అనే మ్యూల్ గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. ఇది భారత సైన్యంలో 30 ఏళ్లపాటు సుదీర్ఘ సేవలు అందించింది. ఒకసారి పాకిస్తాన్ సైనికులకు దొరికిపోయింది. దీంతో వాళ్ళు దాన్ని ఉపయోగించుకుందామని విలువైన తమ ఆయుధాలని దానిపై ఉంచి మరొక చోటుకి తీసుకెళ్తున్నప్పుడు ఆయుధాల మూటతో సహా తెలివిగా తప్పించుకుని భారత్ చేరుకుందట. దాని ధైర్యసాహసాలని గుర్తించిన సైనిక అధికారులు మ్యూల్ దేశభక్తికి ప్రశంసంచకుండా

ఉండ లేకపోయారు. ఢిల్లీలో నీలిరంగు వెల్వెట్ రగ్గుతో సన్మానించారట. అన్నేళ్లు సైన్యంలో పనిచేసినందుకు గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డుల్లోకి ఎక్కింది. ఇలా ఎనలేని సేవలు అందించిన 40 వేల మ్యూల్స్‌కి రిటైర్ కాగా వాటి స్థానంలో ఈ రోబో మ్యూల్స్‌ని ప్రవేశపెట్టారు. 'ఎన్నో సందర్భాల్లో

అవి మా ప్రాణాలు కాపాడతాయి.. వాటిని మరిచిపోవడం . అసాధ్యం' అంటున్నారు సైనికాధికారులు.

నిజమే కదా మరి.

## పీకాక్ వాక్ అంటే ఇదేనా !?



ఈయనెవరండీ బాబూ! తల్లకిందులుగా నడుస్తున్నాడు. చేతులు కిందకు ఆనించి, కాళ్ల ఆకాశం వైపు పెట్టి అలా మెట్లు దిగేస్తున్నాడు. వామ్మో.. ఏమీ కథ తెలుసుకోవాల్సిందే. చైనాలోని షానోంగ్ ప్రావిన్స్‌కి చెందిన సన్ గౌ షాన్ మాత్రం అలా వేలాది మెట్లను అవలీలగా ఎక్కేస్తున్నాడు. అంతేకాదు, ఎత్తైన ప్రదేశాల్లోని చారిత్రక కట్టడాలకు చేతులతో నడుస్తూ వెళ్లాలని సంకల్పించాడు. అప్పట్నుంచీ ఇప్పటి వరకూ దాదాపు పదివేల అడుగుల ఎత్తులో దాదాపు 40 ప్రదేశాలకు వెళ్లాడు సన్. త్వరలోనే గిన్నిస్ బుక్‌లోకి ఎక్కేందుకు సిద్ధమవుతున్నాడు. తలకిందులుగా నడవడాన్ని 'పీకాక్ వాక్' అంటారు. యోగా గురువులు శారీరక దృఢత్వాన్ని పెంచుకోవడానికి పీకాక్ వాక్ చేస్తారు. ఒకప్పుడు కండరాల బలహీనతతో బాధపడిన సన్ సమస్యను ఢిల్లీలో యోగా సాధన చేసి తన దూరం చేసుకున్నాడు. అందులో భాగంగా శీర్షాసనం వేయడంలో పట్టు సాధించాడు. బాబారామ్ స్ఫూర్తితో శరీరాన్ని బ్యాలెన్స్ చేస్తూ పడిపోకుండా తలకిందులుగా నడవడం సాధన చేశాడు. తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవడానికి మెట్లుఎక్కడం మొదలుపెట్టాడు సన్. పెద్ద సాహసమే మరి!

## స్ట్రా ఊదితే బుడగ!

బుడగలు అంటే ఇష్టపడని పిల్లలెవరైనా ఉంటారా... అందుకే బెలూన్లలో సరికొత్త వెరైటీలు వస్తూనే ఉంటాయి. అలా ఈమధ్య బబుల్ బ్లోయింగ్ టాయ్స్ వచ్చేశాయి. చిన్న ట్యూబ్, సన్నని స్ట్రాపైప్స్‌తో ఉండే ఈ

కిట్లో ట్యూబ్‌లోని ఫోమ్ గ్లూని తీసి రెండువైపులా రంధ్రాలు ఉండే స్ట్రా ముక్కకి ఒకవైపు ఉండాలి. ఆ తర్వాత రెండో వైపు నుంచి నోటితో గాలిని ఊదితే చాలు, ముందు వైపు బెలూన్ తయారై పోతుంది. పుట్టిన రోజు వేడుకల్లో, సెలవుల్లో పిల్లలకు దీన్ని ఇచ్చారంటే బుడగలతో ఆడుకోవడం కన్నా సరదాగా వాటిని తయారు చేస్తూనే సంబరపడి పోతుంటారు.



కథ


# అనుభూతుల చెలమ !

**సుమ కైకాల**

"అమ్మా! నీకు వొంట్లో బాగా లేదుగా, నువ్వు రెస్టు తీసుకోకపోయావా? ధాత్రి నిదానంగా ఆ పనులన్నీ చేసుకుంటుంది కదా?" హాల్లో కూర్చుని చిక్కుడుకాయలు ఒలుస్తున్న తల్లితో అన్నాడు మనోజ్.

"కడుపుతో ఉన్నమ్మాయి పని చేస్తుంటే నేను చూస్తూ ఊరుకోలేను నాన్నా! అయినా చిక్కుడుకాయలు ఒలవడం కూడా పెద్ద పనేనా?" అంది లలిత."నీకు ఆరోగ్యం బాగుంటే అన్ని పనులు నువ్వే చేస్తావు. డాక్టర్ నీకు బిపి ఎక్కువగా ఉందని చెప్పారని ధాత్రి చెప్పింది. అందుకే కాసేపు పడుకోమని చెప్తున్నాను" అన్నాడు మనోజ్.

"అలాగే, పడుకుంటాను కానీ రాత్రి నీతో చెప్పడం మరచిపోయాను నిన్న సాయంత్రం ఆస్పత్రిలో మీ స్కూల్ టీచర్ దేవికగారు కనిపించారు" అంది



లలిత. అదేంటి ఆవిడ వసంతపురంలో ఉండటం లేదా? హైదరాబాద్ ఎందుకు వచ్చారు? ఆస్పత్రిలో అంటున్నావు ఏదైనా చికిత్స కోసం వచ్చారా? మేడం నిన్ను గుర్తు పట్టారా అమ్మా?" ఆఫీసుకి వెళ్ళబోతున్న మనోజ్ ఆగాడు.

నిక్షేపంలా గుర్తుపట్టారు నన్నే కాదు నిన్ను, చెల్లిని కూడా గుర్తుచేసారు. మీ నాన్నగారి గురించి అడిగారు ఆయన ఈ మధ్యే కాలం చేసారని చెప్తే ఆవిడ చాలా బాధపడ్డారు" చెప్తున్న లలిత గొంతు దుఃఖంతో వణికింది.

"అమ్మా! ఏడుస్తున్నావా?" వెనక్కు తిరిగివచ్చి తల్లి భుజాల చుట్టూ చెయ్యి వేసి దగ్గరకు తీసుకున్నాడు మనోజ్.

కొడుకు ఆప్యాయత ఆవిడ బాధను మరింత పెంచింది. వీళ్ళ మాటలు వినబడిన ధాత్రి లోపల నుండి బయటకు వచ్చింది.

"అత్తయ్యా ఏమైంది? ఎందుకలా ఏడుస్తున్నారు?" కంగారుగా దగ్గరకు వచ్చింది ధాత్రి. ఏమీలేదు అమ్మకు నాన్నగారు గుర్తొచ్చారు. నిన్న ఆస్పత్రిలో మా టీచర్ కనిపించారని చెప్పింది. ఆవిడ నాన్నగారి గురించి అడిగారట కదా?" అన్నాడు మనోజ్.

అవునడీ నిన్న ఆస్పత్రిలో కూడా అత్తయ్య కంటనీరు పెట్టుకున్నారు" అంది ధాత్రి.

"అదేం లేదులే నాన్నా! నీకు ఆఫీసుకి సమయం అవుతోంది ఇక బయల్దేరు" కొడుకు చేతులను విడిపించుకుని చీర చెంగుతో కళ్ళు తుడుచుకుంటూ అంది లలిత."ఏవండీ! నిన్న మీ టీచర్ మీరు, వదిన బాగా చదివేవారని చెప్పారు. అత్తయ్య నన్ను ఆవిడకు పరిచయం చేసారు. నన్ను చాలా బాగున్నావని మెచ్చుకున్నారు. మీది, వదినది ఫోన్ నంబర్లు కూడా తీసుకున్నారు"

అంది ధాత్రి.

ధాత్రి మాటలకు మనోజ్ ముఖం వెలిగిపోయింది.

"ఆవిడ మా స్కూల్ మొత్తానికి స్ట్రిక్ట్ టీచర్. ఎనిమిదవ తరగతి నుండి పదవ తరగతి వరకు ఇంగ్లీషు, మాథ్స్ సబ్జెక్టులు చెప్పేవారు. ఎవరికి మార్కులు తగ్గినా రోజంతా నీల్ డౌన్ వేయించే వారు. అందుకే అందరం చచ్చినట్లు బాగా కష్టపడి చదివేవాళ్ళం. ఆవిడ చూడటానికి చాలా గంభీరంగా ఉండేది. ఎప్పుడూ ఎవరితోనూ ఎక్కువగా మాట్లాడటం, నవ్వడం నేను చూడలేదు. అమ్మో! అలస్యమైపోయింది నేను వెళ్తున్నాను" అంటూ వెళ్ళిపోయాడు

మనోజ్.అత్తయ్యా! మీరు వెళ్ళి పడుకోండి. వాటిని నేను ఒలుస్తాను" అని బలవంతంగా లలిత చేతుల్లో నుండి చిక్కుడుకాయల గిన్నె తీసుకుంది ధాత్రి.లలిత లోపలకు వెళ్ళి కళ్ళు మూసుకుని పడుకుంది.

..........

లలిత, ప్రకాష్లు కామారెడ్డి దగ్గర వసంతపురం అనే పల్లెటూరులో ఉండేవారు. ప్రకాష్ వి ఆర్ ఓగా ఉద్యోగం చేస్తుండేవాడు. వాళ్లకు ఇద్దరు పిల్లలు. మనోజ్ హైదరాబాద్ లో సాఫ్ట్ వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. ఏడాది క్రితం ధాత్రితో అతనికి పెళ్లి జరిగింది. ప్రస్తుతం ధాత్రి ఐదు నెలల గర్భవతి. మాధురికి మూడేళ్ల క్రితం పెళ్లయి భర్తతో బెంగళూర్లో కాపురముంటుంది. సరిగ్గా ఎనిమిది నెలల క్రితం హార్ట్ ఎటాక్ వచ్చి ప్రకాష్ అనంతవాయువుల్లో కలిసిపోయాడు. లలితను ఒక్కదాన్నే వసంతపురంలో ఉంచటం ఇష్టంలేక మనోజ్ తమతో పాటు హైదరాబాద్ తీసుకొచ్చే సాడు. లలిత భర్త జ్ఞాపకాలను మరువలేక వాస్తవంతో రాజీపడేందుకు ప్రయత్ని స్తుంది. సహజంగానే ప్రకాష్, లలిత దంపతులు మంచివారు. కోడలిని, అల్లుడిని కూడా తమ పిల్లలతో సమానంగా చూసుకుంటారు. వాళ్ళు కూడా అత్తగారితో, మామగారితో ప్రేమగానే ఉంటారు. మనోజ్ కొత్త ప్రాజెక్టు

వర్క్లో ఉండగా అతడి ఫోన్ రింగయింది. ఏదో కొత్త నంబరు నుండి వీడియో కాల్ వస్తుండటం చూసి పనికి ఆటంకం కలుగుతుందని లిఫ్ట్ చేయకుండా వదిలేసాడు.

కాసేపట్లో అదే నంబరు నుండి మళ్ళీ కాల్ వచ్చింది. ఎవరో రెండవసారి కూడా చేసారను కుంటూ ఫోన్ కట్ చేసి

మామూలు కాల్ చేసాడు. "హలో"... "ఎవరు మాట్లాడేది? మనోజేనా?"... ఎప్పుడో పరిచితమైన స్వరం అంటోంది.

మనోజ్ కి ఉదయం ధాత్రి చెప్పిన విషయం గుర్తొచ్చింది. మేడం.. దేవిక మేడం అయుంటారా?...

"మేడం! మీరేనా?" ఉద్వేగభరితంగా అన్నాడు మనోజ్."అవును నేనే మనోజ్. ఎలా ఉన్నావు?"

నవ్వుతూ అంది దేవిక.

"బాగున్నాను మేడం. మీరు నిన్న ఆస్పత్రిలో కనిపించారని అమ్మ చెప్పింది. మీరు వసంతపురంలో ఉండటం లేదా?"...

నేను రిటైర్ అయ్యాక కొన్నాళ్ళు అక్కడే ఉన్నాను. ఈ మధ్య నాకు ఆరోగ్యం బాగుండటం లేదని మా

పెద్దబ్బాయి రాము ఇక్కడకు తీసుక వచ్చాడు" అంది మేడం. "మేడం! సర్ పోయారని అమ్మ వాళ్ళ ద్వారా తెలిసింది. చాలా బాధపడ్డాను. స్కూల్ తరువాత కాలేజీ, ఉద్యోగం అన్నీ హైదరాబాద్ లోనే కావడంతో మన ఊరికి ఎపుడైనా వచ్చినా హడావుడిగా తిరుగు ప్రయాణమవుతాను. మిమ్మల్ని పలకరించడానికి కూడా రాలేకపోయింన దుకు మన్నించండి"

అన్నాడు మనోజ్.

"పర్వాలేదు మనోజ్! రాత్రి నీ భార్యను చూసాను, అణకువగా చాలా బాగుంది." అంది దేవిక.

"థాంక్స్ మేడం! మీరు ఇక్కడే ఉంటున్నారుగా, నేను అడ్రస్ తీసుకుని ఒకసారి వచ్చి కలుస్తాను. ఇప్పుడు వర్క్‌లో ఉన్నాను ఫోన్ పెట్టేయనా మేడం?" తటపటాయిస్తూ అన్నాడు మనోజ్.

"అయ్యో మనోజ్! పని సమయంలో నిన్ను ఇబ్బంది పెట్టినట్లున్నాను. సారీ!" అంది దేవిక.

"మీరు సారీ చెప్పడమేంటి మేడం? వీలైతే సాయంత్రం ఇంటికి వెళ్ళాక మీకు ఫోన్ చేస్తాను" అంటూ

ఫోన్ పెట్టేసాడు మనోజ్.

మనోజ్ ముఖంలో ఆనందం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. దేవిక టీచర్ అంటే స్కూల్ అంతటికీ హడల్.. చదువు బాగా చెప్తుంది అంత కన్నా బాగా క్రమశిక్షణ పాటిస్తుంది. ఆవిడ పిల్లలలో ఎవరినైనా మెచ్చుకుంటే చాలు వారి జన్మ ధన్యమయినట్లు భావించేవారు. స్కూల్ నుండి బయటకు వచ్చాక ఆవిడకు ఎదురు పడింది లేదు.. ఇన్నాళ్ళకు ఆవిడ ఫోన్ చేసి పలుకరించగానే అతడికి ఆకాశంలో జాబిల్లి అరచేతిలో ఇమిడినంత గర్వంగా అనిపిస్తోంది. ఆ సంతోషంలో అతడు చేయవలసిన ప్రాజెక్ట్ వర్క్ అవలీలగా చేసేసాడు. సాయంత్రం ఇంటికి రాగానే విషయం తల్లికీ, భార్యకు చెప్పాడు. వాళ్ళు అతడి ఆనందం చూసి నవ్వుకున్నారు. "అయితే ఇప్పుడు మీ టీచర్‌కి ఫోన్ చేస్తారా?" అంది ధాత్రి.

"మా కొలీగ్ ఒక పని మీద బయటకు వెళ్ళడానికి తోడు రమ్మన్నాడు. ఫ్రెష్ అయ్యాక అక్కడకు వెళ్ళాలి. తిరిగి వచ్చాక చేస్తాను" అన్నాడు మనోజ్. అంతలో మాధురి నుండి అతడికి ఫోన్ వచ్చింది. కుశలప్రశ్నలయ్యాక దేవిక టీచర్ ఫోన్ చేసిందని చెప్పింది. "మధూ! నాకు కూడా ఆఫీసులో ఉన్నప్పుడు మేడం ఫోన్ చేసారు. నువ్వెలా ఫీల్ అయ్యావో కానీ నాకైతే ఎగిరి గంతేయాలనిపించింది" అన్నాడు మనోజ్.

"ఒరేయ్ అన్నయ్యా! నాకు కూడా అలాగే అనిపించింది. స్కూల్లో ఉన్నప్పుడు మేడం అసలు ఎంత తక్కువగా మాట్లాడేవారో కదా? ఇప్పుడు ఎంత బాగా మాట్లాడుతున్నారో! మా ఫ్రెండ్స్ పేర్లు కూడా అన్నీ ఆవిడకు గుర్తున్నాయి. అందరి ఫోన్ నంబర్లు అడిగి తీసుకున్నారు" అంది మాధురి.

"ఓహ్! ఇన్నాళ్ళ తరువాత మనం ఎంతగానో ఇష్టపడే టీచర్ తో మాట్లాడటం నాకు చాలా గర్వంగా ఉంది" అన్నాడు మనోజ్."నేనైతే మా స్కూల్ గ్రూపులో టీచర్ నాతో మాట్లాడారని మెసేజ్ పెట్టాను. అందరూ ఆశ్చర్యపోయి నాకు బోలెడు మెసేజ్‌లు పెట్టారు" ఆమె ఆనందం గొంతులో తెలుస్తోంది."అయితే నేనూ మా స్కూల్ గ్రూపులో మెసేజ్ పెడతాను" అన్నాడు మనోజ్.

"అన్నయ్యా! నన్ను కాపీ కొడుతున్నావా? వె వె..వె వె" వెక్కిరిస్తూ ఫోన్ పెట్టేసింది మాధురి.

మనోజ్ నవ్వుతూ కాసేపట్లో వస్తానని ధాత్రికి చెప్పి బయటకు వెళ్ళిపోయాడు. ఇంటికి తిరిగి రావడం ఆలస్యమవడంతో టీచర్ ఫోన్ విషయం మరచిపోయాడు. నాలుగు రోజుల తరువాత సాయంత్రం వేళ టీచర్ దగ్గర నుండి అతడికి వీడియో కాల్ వచ్చింది.

"మేడం! ముందుగా మీకు సారీ చెప్తున్నాను. రోజూ సాయంత్రం ఇంటికి రాగానే మీకు ఫోన్ చేయాలని ఆఫీసులో ఉన్నప్పుడు అనుకుంతున్నాను. ఇంటికి రాగానే మరచి పోతున్నాను" ఫోన్ తీస్తూనే అన్నాడు మనోజ్.

"అర్థం చేసుకోగలను మనోజ్.. ఇంటికి రాగానే చాలా బాధ్యతల్లుంటాయి కాబట్టి మరచిపోవడం సహజం" అంది దేవిక."మేడం! మీకు ఆరోగ్యం బాగా లేదని అమ్మ చెప్పింది. ఇప్పుడెలా ఉన్నారు?" అన్నాడు మనోజ్.

"వయసు పెరుగుతున్నప్పుడు ఏదో ఒక అనారోగ్యం వస్తూనే ఉంటుంది. ఇప్పుడు పర్వాలేదు మనోజ్. స్కూల్లో నీతో పాటు ఎప్పుడూ ఇద్దరు ఫ్రెండ్స్ ఉండేవారు వారి పేర్లేమిటి?" అంది దేవిక.

"మీకు భలే గుర్తుంది మేడం! ఒకడు రమణ జగిత్యాలలో మున్సిపల్ ఆఫీసులో ఉద్యోగం చేస్తున్నాడు. మరొకడు విజయ్ హైదరాబాద్ లోనే సాఫ్టువేర్ ఉద్యోగం చేస్తున్నాడు." అన్నాడు మనోజ్."నాకు వాళ్లిద్దరి ఫోన్ నంబర్లు మెసేజ్ చేయి"

"అంది దేవిక. అలాగే మేడం!" అన్నాడు మనోజ్.

తరువాత ఇద్దరూ స్కూల్లో ఉన్నప్పటి విషయాల గురించి చాలాసేపు మాట్లాడుకున్నారు. మరో నాలుగు రోజులు గడిచాయి. "దేవికా మేడం నాకు వీడియో కాల్ చేసారోచ్!" స్కూల్ గ్రూపులో మెసేజ్ పెట్టాడు విజయ్. "నీకే కాదు నాకు కూడా వీడియో కాల్ చేసారోచ్!" వెంటనే తను కూడా మెసేజ్ పెట్టాడు రమణ."మీ ఇద్దరికీ మేడం దగ్గర నుండి ఫోన్ రావడానికి కారణం నేనోచ్" అని మెసేజ్ పెట్టాడు మనోజ్.

"మేడం మన ఫ్రెండ్స్‌లో చాలా మందిని గుర్తుచేసారు. కొంతమంది నంబర్లను కూడా తీసుకున్నారు" విజయ్ మెసేజ్ పెట్టాడు.ముగ్గురు మిత్రులు కాసేపు సరదాగా టీచర్ గురించి మెసేజ్ లు పెట్టుకున్నారు.

మరో వారం రోజుల తరువాత మనోజ్‌కి దేవిక టీచర్ నుండి వీడియో కాల్ వచ్చింది. అప్పుడు అతడు బయట ఉండటంతో వీడియో కాల్ కట్ చేసి మామూలు కాల్ చేసాడు. "మేడం! నేను పనిలో ఉన్నాను వీడియో కాల్ మాట్లా డటం కుదరదని మామూలు కాల్ చేసాను" అన్నాడు మనోజ్.

"పర్వాలేదు మనోజ్! నాకు నిన్ను చూడాలనిపించింది అందుకే చేసాను" అంది దేవిక. "మరోసారి వీడియో కాల్ చేస్తాను మేడం. ఇప్పుడు బయటు న్నాను. ఏమీ అనుకోకండి" అంటూ ఫోన్ పెట్టేసాడు మనోజ్.

"మేడం ఏమనుకున్నారో! కాసేపాగి కాల్ చేయాలి అనుకున్నాడు మనోజ్.

కాసేపట్లో విజయ్ దగ్గర నుండి అతడికి ఫోన్ వచ్చింది.

"అరేయ్! మేడం నీకు ఫోన్ చేస్తున్నారా?... అడిగాడు విజయ్.

"ఇప్పుడే వీడియో కాల్ చేసారు. నేను బయట ఉండటం వల్ల మామూలు కాల్ చేసి విషయం చెప్పి పెట్టేసాను" అన్నాడు మనోజ్. "మనూ! మేడం మాటి మాటికీ వీడియో కాల్ చేస్తున్నారు. మొదట్లో బాగా సంతోషం కలిగింది కానీ ఇప్పుడు ఆవిడతో ఏం మాట్లాడాలో అర్థం కావడం లేదురా" అన్నాడు విజయ్. "మనిద్దరికేనా లేక రమణకి కూడా ఫోన్ చేస్తున్నారా?" అన్నాడు మనోజ్. "ఇందాకే వాడు కూడా ఫోన్ చేసి ఇదే విషయం చెప్పాడు. ఊరికూరికే వీడియో కాల్ చేస్తే ఎక్కడ మాట్లాడగలం అని గొడవ చేసాడు" అన్నాడు విజయ్.

"అసలు ఆవిడతో మనకు మాటలు ఏముంటాయిరా? పాత సంగతులు నెమరు వేసుకోవడం? సరేలే ఈ విషయం మళ్ళీ మాట్లాడుకుందాం బై" ఫోన్ పెట్టేసాడు మనోజ్...........

"మనూ! మీ దేవిక టీచర్ నీకు ఫోన్ చేస్తుందా" మరో నాలుగు రోజుల తరువాత భోజనాలు చేసేటప్పుడు లలిత అడిగింది. "ఇంచుమించు రోజూ చేస్తున్నారమ్మా.. ఎందుకో గానీ వీడియో కాల్ చేస్తున్నారు. పని చేసేటప్పుడు వీడియో కాల్ ఎలా మాట్లాడం? మాట్లాడటం కుదిరనప్పుడు వీడియోకాల్ కట్ చేసి మామూలు కాల్ చేస్తున్నాను. అయినా రోజూ ఆవిడతో మాట్లాడటానికి మాటలు వెతుక్కోవాల్సి వస్తుంది." అన్నాడు మనోజ్.

"ఇందాక మాధురి కూడా అదే విషయం చెప్పింది. వంట చేసేటప్పుడు, పిల్లల పనుల్లో ఉన్నప్పుడు వీడియో కాల్ చేస్తే మాట్లాడటం చాలా ఇబ్బందిగా ఉంటుంది. ఆన్ చేయకపోతే టీచర్ కదా ఏమనుకుంటారోనని అనిపిస్తుంది. ఎప్పుడో ఒకసారి అంటే పర్వాలేదు కానీ రెండు రోజులకు ఒకసారి ఆవిడతో నాకేం మాటలుంటా యని గొడవ చేసింది" అంది లలిత.

"అయితే మేడం మధుకి కూడా ఫోన్ చేస్తున్నారా? రమణ, విజయ్ కూడా అదే గొడవ చేస్తున్నారు. ఆవిడ ఎందుకిలా అందరికీ వీడియో కాల్ లు చేసి విసిగిస్తున్నారు?" ఆశ్చర్యంగా అన్నాడు మనోజ్.

"మీరంతా పూర్వ విద్యార్థులు కదా? రిటైర్ అవడం వల్ల పాత జ్ఞాపకాలు గుర్తు చేసుకోవచ్చనేమో!" అంది ధాత్రి.

"ఇప్పటికే నేను చెప్పిన విషయాలు ఆవిడకు మళ్ళీ మళ్ళీ చెప్తున్నాను. అందరూ నాలాగే కదా? ఏమో ఇదంతా చూస్తే మిగిలిన వాళ్లకు కూడా ఇలాగే ఫోన్ చేస్తున్నారేమో? గ్రూప్‌లో అడిగితే తెలుస్తుంది" అంటూ మనోజ్ తినడం పూర్తిచేసి ఫోన్ తీసుకుని గదిలోకి వెళ్ళిపోయాడు. లలిత కొడుకు మాటలు విని ఆలోచనలో పడింది.

"దేవిక మేడం మీలో ఎవరికైనా ఫోన్ చేస్తున్నారా?" గ్రూపులో మెసేజ్ పెట్టాడు మనోజ్. "నాకు చేస్తున్నారు"

"రోజూ వీడియో కాల్ చేస్తున్నారు"...

రోజు మార్చి రోజు వీడియో కాల్ చేస్తున్నారు"...

"బాబోయ్! ఎందుకురా ఆవిడ ఫోన్ చేసి ఇలా చంపుతున్నారు?"...

"ఆవిడ ఫోన్ అంటేనే భయం వేస్తుంది" .."నేనైతే ఆన్సర్ చేయడం కూడా మానేసాను"

అందరి మెసేజ్‌లు చదివిన మనోజ్ బుర్ర తిరిగిపోయింది. ఆవిడ ఎందుకలా చేస్తుందో ఎవరు చెప్తారు?... ఆలోచిస్తూ ఫోన్ పట్టుకుని మళ్ళీ హాల్లోకి వచ్చాడు. అప్పటికే లలిత, ధాత్రి హాల్లో కూర్చుని టీవీ చూస్తున్నారు.

అమ్మా! మేడం మా ఫ్రెండ్స్ అందరికీ వీడియో కాల్ చేస్తున్నారని తెలిసింది. మాటలు పొదుపు చేయాలని స్కూల్లో ఆవిడ మాకు ఎన్నోసార్లు చెప్పారు. మరి ఇప్పుడేంటి ఎప్పుడో విద్య నేర్పిన విద్యార్థులను ఇలా విసిగిస్తున్నారు?" వింతగా చూస్తూ అన్నాడు మనోజ్.

"మనూ! ఆవిడ భయంకరమైన పేదరికంతో అల్లాడుతున్నారు" మెల్లిగా అంది లలిత.

"అదేంటి అత్తయ్యా! ఆవిడకు పెన్షన్ వస్తుంది కదా? అది ఖర్చులకు సరిపోవ దం లేదంటున్నారా?" అంది ధాత్రి.

"అమ్మా! రామన్నయ్య, మధన్నయ్య ఇద్దరూ మంచి ఉద్యోగాలు చేస్తున్నారని నాకు తెలుసు. మేము అపుడపుడూ ఎక్కడైనా కలుస్తాము. బాగానే మాట్లాడుకుంటాం. మేడం పెన్షన్‌తో పాటుగా సర్ పెన్షన్ కూడా ఆవిడకు వస్తుంది. ఇంకా పేదరికమేంటి?" ఆశ్చర్యంగా అన్నాడు మనోజ్.

"నేను చెప్పే పేదరికం ఆర్థికపరమైంది కాదు" అంది లలిత. "మరే పేదరికం?" అన్నాడు మనోజ్. "మనూ! దేవిక మేడం మొదటి నుండీ అందరితో అంటీముట్టనట్లు పొగరుగా ఉంటారని నీకు తెలుసు. సర్ బ్రతికి ఉన్నంత కాలం ఆవిడ ఎవరినీ లెక్కచేయలేదు. ఆయన పోయాక కొడుకుల పెళ్ళిళ్ళు అయ్యాయి. కోడళ్లను కూడా ప్రేమగా దరి చేర్చుకోలేదు. అహంకారంతో తన చుట్టూ గిరి గీసుకుని వారిని దూరం పెట్టింది. వాళ్ళు మొదట్లో బాధపడినా ఏళ్ల గడుస్తున్నాక ఆవిడను పట్టించు కోవడం మానేసారు. ఉద్యోగం చేస్తున్నప్పుడు ఆవిడకు ఒంటరితనం సమస్యగా అనిపించలేదు. ఎప్పుడైతే రిటైర్ అయ్యారో అప్పుడు భరించడం కష్టంగా మారింది. మన ఊర్లో ఆవిడ గురించి అందరూ ఇలాగే చెప్పుకుంటారు. ఇప్పుడు దేవికగారు హైదరాబాద్ వచ్చారంటే అత్తాకోడళ్ళ మధ్య దూరం తగ్గిందేమో అనుకున్నాను. కానీ నువ్వు చెప్పేది వింటుంటే ఆవిడ మానసికంగా చాలా బాధపడుతున్నారనిపిస్తోంది" అంది లలిత.

"అయితే ఆవిడ మా కెందుకు ఫోన్ చేస్తున్నారు?" అన్నాడు మనోజ్.

"ఒంటరితనం అంటే ఒంటరిగా జీవించడం కాదు నాన్నా! అనుబంధాల్లో చోటు చేసుకుంటున్న వెలితి వల్ల పదిమందిలో ఉన్నా తనకంటూ ఎవరూ లేనితనాన్ని అనుభూతి చెందడం.

ఆ సమయంలో వారు సాంత్వన కోరుకుంటారు. అదే మీ మేడం చేస్తున్నారు. మీతో మాట్లాడి ఒంటరితనాన్ని పోగొట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు" అంది లలిత.

"అత్తయ్యా! ఇదంతా మీరెలా చెప్పగలుగుతున్నారు?" ఆసక్తిగా అడిగింది ధాత్రి.

"సహజంగా పిల్లలు రెక్కలొచ్చి ఎగిరిపోయాక వారికి తల్లితండ్రులతో అవసరాలు తగ్గిపోతాయి. అప్పటి వరకు ఎంతో ప్రేమగా ఉండేవారు కూడా వారి కుటుంబ బాధ్యతలలో పడిపోయి కన్నవారికి దూరమవుతారు..మనోజ్, మధు మా దగ్గర నుండి వెళ్ళిపోయాక మేమిద్దరం మిగిలిపోయాం. ఉన్నట్లుండి మీ మావయ్యగారు నన్ను ఒంటరిని చేసారు. నా చుట్టూ ఎంతమంది ఉన్నా నేను ఒక్కదాన్నే అనిపించింది. బ్రతుకు మీద అంతులేని విరక్తితో చచ్చిపోవా లనుకున్నాను. కానీ నువ్వు, మను, మధు, మనవళ్ళు ప్రేమగా మాట్లాడుతూ నా ఒంటరితనం పోగొట్టి మనిషిగా నిలబెట్టే ప్రయత్నం చేస్తున్నారు. కానీ దేవిక మేడం పరిస్థితి అలా కాదు." అంది లలిత."అత్తయ్యా! మేడంతో వారి కుటుంబ సభ్యులు ప్రేమగా ఉండరా?" అంది ధాత్రి.

"నాకు పూర్తిగా తెలియదు.. కానీ ఆవిడ మొదటి నుండీ ఉద్యోగానికి, డబ్బుకి ఇచ్చిన విలువ మరి దేనికిచ్చి నట్లు అనిపించడం లేదు. ఎవరితోనూ సత్సంబంధాలు ఉన్నట్లు ఊర్లో ఎవరూ చెప్పలేదు. స్నేహితులతో, బంధువులతో కూడా ప్రేమగా మసలుకోలేదు. వాళ్ళతో మాట్లాడితే ఇన్నాళ్ళు లేనిది ఇప్పుడు కావలసి వచ్చామా అని దెప్పుతారు. అందుకనే ఆవిడ పూర్వ విద్యార్థులను ఎన్నుకున్నారు." అంది లలిత.

"అమ్మా! ఒకవేళ నువ్వు చెప్పేది నిజమనుకుంటే మామూలు కాల్ చేయకుండా ప్రతిసారి వీడియో కాల్ ఎందుకు చేస్తున్నారు? నాకు అయోమయంగా అనిపిస్తోంది. ఈ చిక్కుముడి వీడాలంటే రామన్నయ్యకి ఫోన్ చేయాల్సిందే!" అన్నాడు మనోజ్.

"రాముకి ఫోన్ చెయ్యి కానీ నువ్వేమీ మేడం గురించి చెప్పకుండా అడగకుండా అతను చెప్పేది విను" అంది లలిత.

మనోజ్ సరేనని తలూపి రాముకి ఫోన్ చేసాడు. "రామన్నయ్యా! నేను మనోజ్‌ని మాట్లాడుతున్నాను. మేడం నెల క్రితం అమ్మకు ఆస్పత్రిలో కనిపించారట. ఇప్పుడు ఎలా ఉన్నారు?" అన్నాడు మనోజ్."నువ్వా మనోజ్? అమ్మ ఇప్పుడు బాగానే ఉంది. అంతేనా? లేక అమ్మ నీకు ఫోన్ చేసి విసిగిస్తుందా?" నవ్వుతూ అన్నాడు రాము.మనోజ్ అతడి నవ్వులో హేళన గమనించాడు. జవాబివ్వకుండా మౌనంగా ఉండిపోయాడు.

"మనోజ్! నేను నవ్వానని తప్పుగా అనుకోకు. ఒకప్పుడు అమ్మ ఎవరితో సరిగ్గా మాట్లాడేది కాదు. ఇప్పుడు అమ్మతో ఎవరూ మాట్లాడటం లేదు. ఎప్పుడూ తన గదిలో ఒక్కతే ఉంటుంది. అందుకే ఎవరికైనా వీడియో కాల్స్ చేయడం నేను గమనించాను. దగ్గర నుండి వారిని చూడటం కోసం అలా చేస్తుందని అర్థమైంది. అమ్మ పరిస్థితి చూస్తుంటే నాకు చాలా జాలి కలిగింది. కానీ చేతులు కాలాక ఆకులు పట్టుకుంటే లాభం ఏముంది? నా భార్య, తమ్ముడి భార్య, పిల్లలు అమ్మతో మాట్లాడటానికి ఇష్టపడటం లేదు. ఒకప్పుడు ఆవిడకు మేమక్కరలేదు ఇప్పుడు కావాలా అని ఎదురు ప్రశ్న వేస్తున్నారు. ఏమీ చెయ్యలేక, ఎటూ చెప్పలేక నేను, తమ్ముడు వదిలేసాము. కాకపోతే ఆవిడకు కావలసినవి ప్రేమగా కాకపోయినా బాధ్యతగా అందించే విషయంలో తక్కువ చేయకుండా చూసుకుంటున్నాము" అన్నాడు రాము. "చాలా బాధగా అనిపిస్తోందన్నయ్యా! ఇక ఉంటాను" అని ఫోన్ పెట్టేసాడు మనోజ్. "అమ్మా! నువ్వు చెప్పిందే నిజం. మేడం ఒకరకంగా ప్రేమరాహిత్య మనే గదిలో బంధించబడ్డారు. అందుకే ప్రేమనందించే వారి కోసం వెతుకు తున్నారు" అన్నాడు మనోజ్.

"విద్యను నేర్పిన గురువుకి విద్యార్థులు గౌరవం ఇవ్వగలరు కానీ ప్రేమగా గంటల తరబడి కబుర్లు చెప్పలేరు. మీ అందరికీ ఆవిడ ఫోన్ ఇబ్బందిగా మారడం వల్ల అది నిరూపించబడింది" అంది ధాత్రి.

"ధాత్రీ! దేవికగారికి మనసు పంచు కునే స్నేహితులు లేరు. అక్కున చేర్చుకునే బంధువులు లేరు. ఆవిడ ఇన్నాళ్ళ జీవితంలో డబ్బు సంపాదించు కున్నారు కానీ తనకోసం కన్నీరు కార్చేవారిని సంపాదించుకోలేదు. కడుపున పుట్టిన పిల్లలతో బాధ్యతగా వ్యవహరించారే తప్ప ప్రేమను పంచడంలో చూపించలేదు. అందుకే వారు కూడా బాధ్యతను మాత్రమే మోస్తున్నారు. ఒకరకంగా ఇది ఆవిడ స్వయం కృతాపరాధం. ఇప్పుడు ఆవిడ వ్యక్తిగతాన్ని ప్రశ్నించలేని విద్యార్థుల వల్ల ఒంటరితనానికి దూరమవాలన ుకున్నారు" అంది లలిత.

"అమ్మా! నువ్వు చెప్పేది వింటుంటే అందరితో సత్సంబంధాలు కలిగి ఉండటం ఎంత మంచిదో తెలుస్తోంది. ఇప్పుడు దేవిక మేడం విషయంలో జరిగిపోయిన వాటిని వేటినీ మనం వెనక్కు తీసుకురాలేము. అలాగని ఆవిడ ఫోన్ చేస్తే అన్నిసార్లు మాట్లాడటం కూడా కష్టం. మరి ఈ సమస్యకు పరిష్కారం ఎలా?" అన్నాడు మనోజ్. " ఏ సమస్యకైనా ఏదో ఒక పరిష్కారం ఉండే ఉంటుంది. ఆవిడలో ఒంటరితనం పోయి అందరిలో ఉండటం ఎలా సాధ్యమవుతుందో ఆలోచించు" అంది లలిత.మనోజ్ ఆలోచిస్తున్నాడు.

"ఏవండీ! నాకో ఆలోచన వచ్చింది. చెప్పనా?" అంది ధాత్రి.

"ఏమిటది?"...

"మీ స్కూల్ గ్రూపులో మీ టీచర్ గారిని చేర్చండి. నిత్యం అందరూ తెలిసినవాళ్ళ మధ్య సందడిగా ఉంటారు. ఆవిడకు ఇష్టమైతే మీ చర్చలో పాల్గొంటారు. లేకపోతే మీ సంభాషణ చూస్తారు. అప్పుడు ఊరికే ఫోన్ చేయాలన్న కోరిక కూడా తగ్గుతుంది. సామాజిక మాధ్యమంలో పాల్గొనడం వల్ల మీ అందరితో బంధాలు గట్టిపడతాయి" అంది ధాత్రి.

ధాత్రి మాటలకు మనోజ్, లలితల ముఖాలు వికసించాయి.

"ధాత్రీ! మంచి సలహా ఇచ్చావు.. ఇప్పుడే మేడం నంబరు మా గ్రూపులో చెరుస్తాను. వీలైతే మా సీనియర్లు, జూనియర్ల సమూహాలలో కూడా చేర్చే ఏర్పాటు చేస్తాను. దేవికి మేడం గారిని ఊపిరాడనంత బిజీ చేస్తాను" సంతోషంగా అన్నాడు మనోజ్.

జీవితం అనుభూతుల చెలమ లాంటిది. ప్రతీ దశలో ఊహించని ఎన్నో మలుపులుంటాయి. జీవన పయనంలో మనం ముందుకు సాగుతున్నప్పుడు మన చుట్టూ ఉన్నవారిని కలుపుకుంటూ సాగాలి. ఒకో బంధం ముడి వేసుకుంటూ అనుభూతులు పంచుకుంటుంటే మన ప్రయాణంలో అలసట ఉండదు. మనకు ఎవరూ వద్దు ఒక్కరమే చాలనుకుని అందరితో నిర్లక్ష్యంగా ప్రవర్తిస్తే మనం తోడు కావాలనుకున్నప్పుడు ఎవరూ రారు. తోటివారిని ప్రేమించడం మొదలు పెడితే మన చుట్టూ ఉన్న ప్రపంచమంతా ప్రేమమయంగా మారుతుంది. దేవికి టీచర్ జీవితం పడమటి సంధ్యారాగం పాడేందుకు మనోజ్ చేస్తున్న కృషి ఫలించాలని ఆశిద్దాం!...

# స్నేహం తీరు

యామిజాల జగదీశ్

స్నేహానికి ఎంతో విలువ ఉంది. అయితే రాను రాను అవసరాలు స్వార్థం డబ్బు ప్రమేయం స్నేహంలో చోటుచేసుకోవడంతో స్వచ్ఛమైన స్నేహాలు అంతరించిపోతున్నాయి. స్నేహమంటే ఇద్దరు వ్యక్తుల మధ్య నిష్కల్మషమయిన ప్రేమ ఉండాలి. ఒకరంటే ఒకరికి వాత్సల్యం ఉండాలి. ఒకరి పురోభివృద్ధికి మరొకరు సాయపడేలా ఉండాలి. మన స్నేహితుల గురించి మనం గొప్పగా చెప్పుకోగలిగితే మనకుకూడా సమాజంలో విలువ పెరుగుతుంది. అలా చెప్పుకోవాలంటే మనం మంచి స్నేహితులను కలిగి ఉండాలి. మనకన్నా మనస్నేహితులు గొప్పస్థితిలో ఉండాలని కోరుకోవాలి. ఈ రోజుల్లో అవతలివారి పలుకుబడినో డబ్బునో హోదానో అధికారాన్నో చూసి వారితో స్నేహం చేయాలని ప్రయత్నిస్తున్నారు. ధనికులు కూడా తమకు భజనచేసేవారిని చెంచాలుగా ఉండే వారిని వెంట తిప్పుకొంటూ వారు తమ స్నేహితులని చెప్పుకొంటుంటారు.

ఇవి నిజమైన స్నేహాలు కావు.

మన ఇతిహాసాల్లో కూడా గొప్ప స్నేహితులు కనిపిస్తారు. భారతంలో నరనారాయణులైన కృష్ణార్జునులు బంధువులైనా అంతకు మించిన స్నేహం వారికి ఉంది. చివరి వరకు వారు గొప్ప స్నేహితులుగానే ఉన్నారు. అలాగే దుర్యోధనుడు కర్ణుడు కూడా గొప్ప స్నేహితులు. కుంతీదేవి తన కొడుకులకు అన్నగా కర్ణుడికి స్నానమిస్తానని ప్రలోభపెట్టినా కర్ణుడు దుర్యోధనుడి స్నేహాన్ని విడిచిపెట్టలేదు. అనుక్షణం స్నేహితుడి విజయం కోసమే తహతహలాడాడు. అలాగే రామాయణంలో రాముడు సుగ్రీవుడు మంచి స్నేహితులు. ఆ మైత్రీధర్మంతోనే సుగ్రీవుడికోసం రాముడు వాలిని సంహరించాడు. ఆ స్నేహ ధర్మంతోనే సుగ్రీవుడు సీతాన్వేషణలో రాముడికి తోడ్పడడమేగాక రామ రావణ యుద్ధంలో తన వానర సైన్యంతో రాముడికి సాయం చేశాడు. ప్రపంచ చరిత్రలో గొప్ప స్నేహాలు చాలా ఉన్నాయి. మన తెలుగు వారిలో విజయా చిత్ర నిర్మాతలు చందమామ పత్రిక నిర్వాహకులు నాగిరెడ్డి చక్రపాణిల స్నేహం శ్లాఘనీయం. గొప్ప చిత్రకారుడు, చిత్ర దర్శకుడు బాపు గొప్ప రచయిత ముళ్లపూడిల స్నేహం చిరస్మరణీయం. ఇలాంటి స్నేహాలలో నైతిక విలువలు పాటించేవారు. ఇప్పటి స్నేహాల్లో అలాంటి విలువలు కనుమరుగవుతున్నాయి. చాలామంది స్నేహం పేరుతో మనుషులను నమ్మించి దారుణంగా మోసం చేస్తున్నారు. మంచి స్నేహితుడని నమ్మి వారు చేసే అప్పులకు హామీలుగా సంతకాలు చేసిన ఎంతో మంది మోసపోయి ఆస్తులు పోగొట్టుకున్నారు.



రుణం తీసుకున్న వారు అప్పు ఎగ్గొడితే స్నేహ ధర్మంగా మధ్యలో హామీ సంతకం పెట్టిన పాపానికిగాను తాము డబ్బు చెల్లించాల్సి వస్తోంది. స్నేహం పేరిట చనువుగా నటిస్తూ స్నేహితులనే దోపిడీ హత్య చేసిన దుర్మార్గుల కథలు వింటూనే ఉంటాం. స్నేహితులుగా ఉండి వ్యాపారంలో భాగస్వాములుగా చేరి స్నేహితులనే ముంచినవారు చాలామంది ఉన్నారు. డబ్బుకోసం ఇతర ప్రయోజనాల కోసం స్నేహితులుగా చేరి బాగా నమ్మించి మోసం చేసినవారు అడుగడుగునా తారసపడుతున్నారు.

నా అనుభవంలో నా మిత్రుడొకరికి చిన్ననాటి స్నేహితుడు ఉండేవాడు. ఇద్దరి మధ్య ప్రగాఢ స్నేహం ఉండేది. ఈలోగా నా స్నేహితుడికి ఒక స్థలం అమ్మగా చాలా డబ్బు వచ్చింది. వెంటనే అతని స్నేహితుడు తనకు వ్యాపారంలో డబ్బు అవసరమని వ్యాపారం వృద్ధి చెందగానే డబ్బు ఇస్తానని చెప్పాడు. దాంతో అమాయకుడైన ఆ స్నేహితుడు లక్షలాది రూపాయలు ఏ హామీ అడక్కుండా, ప్రామిసరీ నోట్లు కూడా తీసుకోకుండా అతడికి ఇచ్చాడు. తనకు వ్యాపారంలో ఒడుదుడుకుల వల్ల ఇంకొంచెం డబ్బు అవసరం ఉంటే నా స్నేహితుడు ముందూ వెనుకా ఆలోచించకుండా తన ఇంటిని తనఖా పెట్టి ఆ స్నేహితుడికి ఇచ్చాడు. అంతే! అతను నమ్మిన నా మిత్రుడిని నట్టేట ముంచాడు. నా మిత్రుడు ఉన్న సర్వస్వం కోల్పోయి రోడ్డున పడ్డాడు.

ఏ హామీ లేకుండా, సాక్ష్యం లేకుండా డబ్బు ఇవ్వడం వల్ల దారుణంగా మోసపోయాడు. చాలాకాలం స్నేహం నటించిన డబ్బు కాజేసినవాడు హాయిగా బతుకుతున్నాడు. నా స్నేహితుడు మాత్రం భార్యాబిడ్డలను పోషించలేక అప్పులపాలై ఆగర్భదరిద్రుడుగా తిరుగుతున్నాడు. అదే కాస్త అంగబలం ఉన్నవాడయితే అలా మోసం చేసినవాడిపై పగ తీర్చుకొనే వాడు. అలాంటి నయవంచకులు ఉండబట్టే మంచి వాళ్లు కూడా తాము మోసపోయామన్న కక్షతో వారిపై దాడులు చేసి హత్యలకు కూడా పాల్పడుతున్నారు. కానీ నా మిత్రుడికి అంగబలం లేకపోవడంతో చేసేదేమీలేక స్నేహితుడనే ఆ దుర్మార్గుడి ఘాతుకానికి బలయ్యాడు. ఇటువంటి సంఘటనలు చూసినపుడు స్నేహం మీద మనకు నమ్మకం పోతుంది. ఇలాంటి నమ్మక ద్రోహులు స్నేహం పేరిట ఇతరుల వద్దకు చేరి వారిని ఘోరంగా మోసం చేస్తుంటారు.

ఇలాంటివారిని గుర్తించడం కూడా కష్టమే. ఇలాంటి స్వార్థపరుల పట్ల హీనుల పట్ల చాలా జాగ్రత్తగా ఉండాలి. కొంతమంది ఎన్నో మాయమాటలు చెప్పి స్నేహితులుగా ఇతరుల నమ్మకాన్ని సంపాదిస్తారు. తమకు ఏమీలేని స్థితిలో స్నేహితులను వాడుకుంటారు. కొంతకష్టమైనా కొంత డబ్బు వెచ్చించి అయినా మంచి స్నేహితులను దక్కించుకోవాలని కొంత డబ్బు ఖర్చు చేసైనా సరే చెడ్డ వారిని వదిలించుకోవాలని పెద్దలు చెబుతారు. ఆమాట నిజం. వ్యసనాలను ప్రోత్సహించేవాళ్లు చెడ్డపనులకు తోడుగా ఉండేవారు మంచిస్నేహితులు కారని తెలుసుకోవాలి.

# శంకుస్థాపన నియమాలు !


వాస్తువార్త

వాస్తు విద్వాన్ సాయిశ్రీ

డా॥ దంతూరి పండరినాథ్

సెల్: 9885446501/9885449458




### ఆర్.ఎన్, విశాఖపట్నం

ప్రశ్న: వివాహం అయి సంవత్సరం కావస్తోంది. ఇదివరకే నేను కొన్న ప్లాట్‌లో ఇల్లు కడదామని అనుకొంటున్నాను. నా భార్యకు ఇప్పుడు రెండవ నెల. అటువంటప్పుడు ఇల్లు ప్రారంభించకూడదని కొందరు అంటున్నారు. మరికొందరు పర్వాలేదంటున్నారు. మీ సలహా కావాలి. శంకుస్థాపన నియమాలు ఏమిటి?



జవాబు: 'జాత'శౌచమందు, 'మృత' శౌచమందున, రాజ భయం ఏర్పడినప్పుడు, రోగ గ్రస్తమయి వున్నప్పుడు, భార్య రజస్వల అయినప్పుడు, పాప గ్రహ సంచార మందు, దుర్ముహూర్త మందును, శ్రాద్ధమునందును, మాసాంత్యము నందున, భార్య గర్భవతిగా వున్నప్పుడు (ఐదున్నర మాసాలు నిండి వున్నచో) గృహారంభం (భూమి పూజ, శంకుస్థాపన) చేయకూడదు. గర్భ కాలం (నెలలు) విషయంలో మత భేదాలున్నాయి. అందువల్ల భార్య ఎన్ని నెలలు గర్భవతి అయినప్పటికీ భూమిని గునపంతో తవ్వి పనులుచేయకుండుట, చేయించకుండుట ఉత్తమం.

వాయువు: భూమికున్న ఆకర్షణ శక్తిచేత 'వాయువు' భూమిపై కొన్ని మైళ్ల పర్యంతం ఆకర్షింపబడి వున్నది. భూమిపై ఒక జీవి పుట్టి, జీవితం కొనసాగించటానికి అవసరమైన పాళ్లల్లో వాయువు మిశ్రమ రూపంలో (ప్రాణ వాయువు, బొగ్గుపులుసు వాయువు, ఉదజని మొదలైన వాయువులు) వుంది. అత్యంత అవసరమైన వాతావరణాన్ని ఏర్పాటు చేయడంలో వాయువు పాత్ర ముఖ్యమైనది. వాయువు చంచలమైనది. పీడనం వున్న వైపుకు నిరంతరం చలించే 'ధర్మము' కలిగినది. వాయువు చలనంలో 'శబ్దాన్ని' మనం వినగలుగుతాం. తన గమనంలో అడ్డు వచ్చిన దేనినయినా వాయువు స్పృశిస్తుంది. వాయువు 'స్పర్శ'ను మనం 'చర్మేంద్రియ' ద్వారా గ్రహించగలుగుతాం. 'శబ్దగుణంతో' పాటు 'స్పర్శ ప్రధాన గుణం'గా గలది వాయువు. మన పంచేంద్రియాలలో ఒకటయిన చర్మేంద్రియం పంచ భూతాలలో ఒకటయిన వాయువు స్పర్శ గుణంతో సంబంధాన్ని కలిగి వుంది.

### బానోజీరావు, కాకినాడ

ప్రశ్న: గృహంలో వివాహం అయిన తరువాత ఆ గృహాన్ని తీసివేసి నూతన గృహ నిర్మాణం చేయవచ్చా? ఎన్ని నెలలు ఆగాలి? తెలియజేయగలరు.

జవాబు: సాధారణంగా గృహ నిర్మాణం పిదప ఆ గృహంలో ఏదైనా శుభ కార్యం చేయుటం మంగళకరంగా భావిస్తారు. పెళ్లి కుదిరి వుంటే నూతన గృహంలోనే వివాహం జరిపిస్తారు. అలాగే వివాహం జరిగిన తర్వాత కూడా మంచి కార్యక్రమాలు ప్రారంభించటం ఆనందదాయకంగా వుంటుంది. నూతన గృహ నిర్మాణ సంకల్పం శుభకరమైనదైనా పాత గృహాన్ని పడగొట్టడం అశుభంగా భావిస్తారు. అందుకని పెళ్లయిన వెంటనే నూతన నిర్మాణం కోసం పాత యింటిని పడగొట్టరు. అంతేగానీ తప్పకుండా ఇంత కాల వ్యవధి వుండాలన్న నియమం ఏదీ లేదు.

### ఉప్పలయ్య, వరంగల్

ప్రశ్న: మేం మా ఆచార పరంగా కొన్ని సందర్భాలలో (అరుదుగా) ఒక పండుగ చేసుకుంటాం. మాంసా హారం ప్రధానంగా ఉండే సందర్భమది. ఆ ఎముకలను మా గృహావరణంలోనే భూమిలో వేసి మట్టి కప్పేయవలసి ఉంటుంది. కానీ అలా చేయడం వలన మా స్థలానికి 'శల్య వాస్తు దోషం' కలుగుతుందని చెబుతున్నారు. ఇటువంటి దోషం వల్ల ఏవయినా చెడు ఫలితాలు వస్తాయేమోనని భయంగా ఉంది.

జవాబు: గృహావరణలోగానీ, స్థలం లోపల, కింద భూభాగంలోగానీ ఎముకలుంటే అన్ని సందర్భాలలోనూ 'శల్య వాస్తు దోషం' ఏర్పడదు. భూమి ఉపరితలం నుండి మనిషి నిలువు ప్రమాణం లోతు వరకు శల్యములుండ కూడదు. మనిషి నిలువు ప్రమాణం (ఎత్తు) ఆ కాలంలో 8 అడుగులు అంటే 8x12=96 అంగుళాలుగా పేర్కొన్నారు. 8 అడుగుల అంత లోతు గొయ్యి తీసి శల్యములను అందులో వేసి పూడ్చినట్లయితే మీ స్థలానికి శల్యవాస్తు దోషమేర్పడే అవకాశం ఉండదు. కాబట్టి నిర్భయంగా మీ ఆచార వ్యవహారాలు కొనసాగించవచ్చు.

### శ్రీనివాసరెడ్డి, కడప

ప్రశ్న: మాకు ఏ దిక్కు 'మెయిన్ డోర్' ఉన్న ఇల్లయితే బాగుంటుంది? జన్మ నక్షత్రాన్ని బట్టి మెయిన్ డోర్ చెపుతారా?

జవాబు: సింహ ద్వార నిర్ధారణకు 'వ్యవహార నామం' సరిపోతుంది. మీ వ్యవహార నామరీత్యా మీకు 'ఉత్తరం' లేదా 'ఉత్తర ఈశాన్య' సింహద్వార గృహం చక్కగా యోగిస్తుంది. ఉత్తరం వీధి లేని స్థలానికి ఉత్తర ముఖ ద్వారా గృహం కట్టకూడదు. కాబట్టి ఒకవేళ మీరు ఖాళీ స్థలం కొనదలిస్తే ఉత్తరం వీధి ఉన్న ఖాళీ స్థలం కొనండి. ఆ స్థలంలో ఉత్తర ముఖ ద్వార గృహం నిర్మించుకోవడం వలన నిస్సందేహంగా ఉత్తమ ఫలయోగం ఉంటుంది.

---

వాస్తు విద్వాన్ డా॥ దంతూరి పండరినాథ్ పాఠకుల సమస్యలకు ఆదివారం 'వాస్తువార్త'లో సమాధానాలిస్తారు. ఈ కింది కూపన్ జతచేసి సమస్యలు పంపవలసిన చిరునామా: సాయిశ్రీ వాస్తు కన్సల్టెన్సీ, 3-2-4, కింగ్స్‌వే, రాష్ట్రపతి రోడ్, సికిందరాబాద్-3

వాస్తువార్త

పూర్తి పేరు : ........................................

పుట్టిన తేది : ........................................

జన్మ నక్షత్రం: ................తల్లి పేరు: ............

చిరునామా:...........................................

**మన రాష్ట్రంలో ప్రతి గ్రామంలో కూడా ఒకటి రెండు పురాతన ఆలయాలు కనిపిస్తాయి. అన్నీ కూడా వెయ్యి సంవత్సరాల చరిత్రకు సజీవ సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి. ముఖ్యంగా కృష్ణాతీరం విశేష ఆలయాలకు ప్రసిద్ధి. గుంటూరు మరియు కృష్ణా జిల్లాలలో**

**అనేకానేక చరిత్ర ప్రసిద్ధికెక్కిన దేవాలయాలు నెలకొని ఉన్నాయి. అలాంటి ఒక చిన్న ఊరు కొల్లిపర.**

# కోవెలల కొలువు కొల్లిపర

**ఇలపావులూరి వెంకటేశ్వర్లు**

గుంటూరు జిల్లాలో ఉన్న కొల్లిపరకు అనేక వందల సంవత్సరాల చరిత్ర ఉండటం చెప్పుకోవలసిన విషయం. ఆ చరిత్రకు నిదర్శనం గ్రామంలో ఉన్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ జనార్ధన స్వామి మరియు శ్రీ గంగా పార్వతీ సమేత శ్రీ ముక్తేశ్వర స్వామి ఆలయాలు ఈ రెండు ఆలయాలు గ్రామ ప్రధాన రహదారి మీద దగ్గర దగ్గరగానే కనిపిస్తాయి.

**శ్రీ శ్రీదేవి భూదేవి సమేత శ్రీ జనార్ధన స్వామి ఆలయం**

శ్రీమన్నారాయణుడు లోకసంరక్షణార్థం ధరించిన అనేకానేక అవతారాలలో జనార్ధన రూపం ఒకటి మన దేశంలో ముఖ్యంగా దక్షిణ భారత దేశంలో అందులోనూ మనరాష్ట్రంలో మరియు కర్ణాటకలో ఎక్కువగా శ్రీ జనార్ధనస్వామి ఆలయాలు కనపడతాయి. కేరళలోని వర్కల ప్రసిద్ధికెక్కిన శ్రీ జనార్ధన



స్వామి ఆలయం. అలానే ఉడిపి జిల్లాలో కూడా ప్రసిద్ధి చెందిన శ్రీ జనార్ధన స్వామి ఆలయం ఎర్మల్ గ్రామంలో ఉన్నది. మన రాష్ట్రంలో పవిత్ర గోదావరి తీరంలో పౌరాణిక చారిత్రక ప్రసిద్ధి చెందిన నవ జనార్ధన ఆలయాలు కనిపిస్తాయి. ఎక్కడ శ్రీ జనార్ధనస్వామి కొలువై ఉంటారో ఆ క్షేత్ర పౌరాణికగాథ త్రిలోక సంచారి, బ్రహ్మమానస పుత్రుడు, నిరంతర నారాయణ నామస్మరణ చేసే నారద మార్షితో ముడి పడి ఉండడం ప్రత్యేకంగా చెప్పుకోవాలి. పద్దెనిమిది శ్రీ జనార్ధన స్వామి విగ్రహాలను ప్రతిష్ఠించారు అని తెలుస్తోంది. కొల్లిపరలో కొలువు తీరిన శ్రీ జనార్ధన స్వామి కూడా నారద మహర్షి ప్రతిష్ట అని తెలుపుతోంది ఆలయ గాథ. తొలియుగంలో నారద ప్రతిష్ఠిత శ్రీ జనార్ధన స్వామికి అందుబాటులో ఉన్న గాథల ప్రకారం కలియుగంలో చాళుక్య రాజులు ఆలయాన్ని నిర్మించి నట్లుగా తెలుస్తోంది. ఆ రోజులలో ఈ ఊరిని జనార్ధన మిట్ట అని పిలిచేవారట. పదహారవ శతాబ్ద కాలంలో విజయనగర పాలకులైన శ్రీ సదాశివ రాయలు ఈ ప్రాంతానికి వచ్చారట. విజయ నగర పాలకులు శ్రీ వైష్ణవ సంప్రదాయాన్ని అనుసరించే వారు. శిధిలావస్థలో ఉన్న శ్రీ జనార్ధనస్వామి ఆలయాన్ని నిర్మించారని శాసనాలు తెలుపు తున్నాయి. ఆలయ నిర్వహణ నిమిత్తం అనేక కైకార్యాలను, భూములను బ్రాహ్మణులకు దానం ఇచ్చి ఆలయ నిర్వహణ వారికి అప్పగించారట. ఆ కాలంలో వేద పాఠశాలలతో వేదవిద్యకు ప్రసిద్ధి కెక్కిన గ్రామాన్ని సదాశివ పురంగా పిలిచేవారట. కాలక్రమంలో ఇసుక గుట్టలతో నిండిన ప్రాంతంగా కొప్పరగా పిల్లవాడి చివరకు కొల్లిపరగా మారింది అంటారు.



తూర్పు ముఖంగా ఉండే ఈ ఆలయానికి ఎత్తైన రాజగోపురం ఉంటుంది. ఉపాల యాలు లేని చిన్న ప్రాంగణంలో దక్షిణ ముఖంగా శ్రీఅంజనేయ స్వామి ఒక సన్నిధిలో ప్రధాన గర్భాలయంలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీజనార్ధనస్వామి కొలువై ఉంటూ అమ్మవార్ల ప్రతిష్ట అనంతర కాలంలో జరిగినట్లుగా తెలుస్తోంది. ఇరుదేవేరులతో సుందర పుష్ప స్వర్ణ ఆభరణాలు, ఆభరణాలు, పట్టు పీతాంబరాలు ధరించి నేత్రపర్వంగా


శ్రీ జనార్ధన స్వామి దర్శనమిస్తారు. శ్రీ వైష్ణవ ఆగమాల ఆగమాలు ప్రకారం నిర్ణయించిన పూజలు ప్రాతినిధ్యం నిర్వహిస్తారు. హిందూ పర్వదినాలలో, ధనుర్మాసంలో, వైశాఖ మాసంలో, శ్రీ కృష్ణ జన్మాష్టమి, శ్రీ రామ నవమి, వైకుంఠ ఏకాదశి ఘనంగా జరుపుతారు. ముఖ్యంగా ఆలయ ఉత్సవాల సందర్భంగా జరిగే శ్రీవారి కళ్యాణమహోత్సవాల సమయంలో సుముహూర్త సమయానికి ఆలయం మీద రెండు గరుడ పక్షులు ప్రదక్షిణాలు చేస్తాయి. ఇలాంటి విశేషం ఒంగోలుకు సమీపం లోని చదలవాడ గ్రామంలోని శ్రీ రఘునాయక స్వామి ఆలయంలో కూడా కనపడుతుంది.

శ్రీదేవి భూదేవి సమేత శ్రీజనార్ధన స్వామి ఆలయం పరిహార క్షేత్రం. వివిధ కారణాల వలన వివాహం కానీ అవివాహితులు, సంతానం లేని దంపతులు, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారు ఇక్కడ స్వామి వారి కళ్యాణం చేస్తే

సకల కార్యాలు కల్యాణ ప్రదంగా శుభంగా జరుగుతాయన్నది తరతరాల విశ్వాసం.

## శ్రీ గంగా పార్వతీ సమేత శ్రీ ముక్తేశ్వర స్వామి ఆలయం

శ్రీ జనార్ధన స్వామి ఆలయానికి సమీపంలో తూర్పు ముఖంగా విశాల ప్రాంగణంలో అనేక దేవీదేవతల సన్నిధులతో అలరారు తుంటుంది ఆలయం. శ్రీ ముక్తేశ్వర స్వామి వారు స్వయంభూ లింగం అని చెబుతారు. ప్రస్తుతం ఉన్న ఆలయానికి కలియుగంలో తొలి రూపాన్ని ఇచ్చింది చాళుక్య రాజుల కాలంలో అని శాసనాధారాలు తెలుపుతున్నాయి. అనంతరం అనేక మంది రాజవంశాల వారు ఆలయాభి వృద్ధికి తమ వంతు కృషి చేసారని తెలుస్తోంది. ముఖ్యంగా కాకతీయుల కాలంలో ఈ ఆలయ శోభ గొప్పగా ఉండేదట. కాకతీయులు శివారాధకులు వారు ఈ ప్రాంతాన్ని పరిపాలి స్తున్న రోజులలో ఇక్కడ వీరశైవం బాగా ప్రాచుర్యంలో ఉండేదట. ఆ రోజులలో పెద్ద సంఖ్యలో శివారాధ కులు పవిత్ర కృష్ణా తీరానికి తరలి వచ్చారట. అందుకే ఈ ప్రాంతంలోని ప్రతి శివాలయంలో శ్రీ కాలభైరవ మరియు శ్రీభద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి ఉపాలయం కనపడతాయి.



ప్రధాన ఆలయానికి ఉత్తరాన నవగ్రహ మండపం, ఆ వెనుక శ్రీ వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్య స్వామి సన్నిధి, నాగ ప్రతిష్టలు, పుట్ట కనిపిస్తాయి. గతంలో అన్ని శివాలయాలలో నాగప్రతిష్ఠలు జరిగేవి అన్న విషయాన్ని ప్రాంగణంలో కనిపించే శిల్పాలు స్పష్టం చేస్తాయి. నేటికీ

ఈ ఆలయం రాహుకేతు, సర్పదోష మరియు నవగ్రహ పూజలకు ప్రసిద్ధి అదేవిధంగా ప్రతి మాసశివరాత్రినాడు శ్రీ లక్ష్మీ గణపతి హోమం, రుద్ర మరియు చండీ హోమాలు భక్తుల కొరకు ఆర్జిత సేవగా జరుపుతారు. ఆస్థాన మండపానికి అనుసంధానంగా ఉన్న ముఖమండపంలో ధర్మానికి ప్రతీక, నిరంతర శివసేవలో నిమగ్నమై ఉండే నందీశ్వరుడు ఉపస్థితులై ఉంటారు. ఇక్కడ మూడు సన్నిధులు కనపడ తాయి. కాకతీయ ప్రతాపరుద్రుని కాలంలో ముఖమండపం నిర్మాణం జరిగిందని తెలుస్తోంది. స్వయంగా ప్రతాపరుద్రుడు శ్రీ ముక్తేశ్వర స్వామిని సేవించుకొన్నారని కూడా చెబుతారు. దక్షిణం వైపున ఉన్న సన్నిధిలో ప్రథమ పూజ్యుడు శ్రీ వినాయకుడు ఉపస్థితులై దర్శనం ఇస్తారు. ఉత్తరం వైపున ఉన్న సన్నిధిలో జగన్మాత శ్రీ పార్వతీదేవి చతుర్భుజాలతో స్థానిక భంగిమలో నేత్రపర్వమైన అలంకరణలో భక్తులను కాచే వరదాయనిగా కొలువై ఉంటారు.

మధ్యలో ఉన్న ప్రధాన గర్భాలయంలో కొద్దిగా ఉత్తరం వైపుకు వాలి ఉండే ఎత్తైన పానవట్టం మీద చందన, విభూతి, కుంకుమ లేపనలతో పాటు వర్ణమయ పుష్ప అలంకరణలో శ్రీ ముక్తేశ్వర స్వామి లింగరూపంలో నయనానందకరంగా దర్శనాన్ని అనుగ్రహిస్తారు. శైవాగమనాల ప్రకారం నిర్దేశించిన నిత్య పూజలు, అభిషేకాలు, అర్చనలు, అలంకారాలు, నివేదనలు జరుగుతాయి. వైశాఖ, కార్తీక మాస పూజ పూజలు విశేషంగా నిర్వహిస్తారు. మహాశివరాత్రి ఉత్సవాలను ఘనంగా జరుపుతారు. ఉదయం ఆరు నుండి పన్నెండు వరకు తిరిగి సాయంత్ర అయిదు నుంచి రాత్రి ఎనిమిది వరకు ఆలయం తెరిచి ఉంటుంది.

## శ్రీ వీరభద్ర స్వామి ఆలయం

శ్రీ ముక్తేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఉత్తర దిశలో శ్రీ వీరభద్రస్వామి సన్నిధి కనిపిస్తుంది. ఇక్కడే ఈశాన్యంలో కల్యాణ మండపం కూడా నిర్మించబడినది. శ్రీ వీరభద్రస్వామి ఆలయ నిర్మాణం సుమారు మూడు శతాబ్దాల క్రిందట జరిగినట్లుగా తెలియవస్తోంది. ఆలయం విడిగా ధ్వజస్థంభం, ముఖమండపం అంతరాలయం కలిగి ఉంటుంది.

శ్రీ వీరభద్ర స్వామి భక్తసులభుడు. భక్తులు ఎవరైతే జాతకరీత్యా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారో, నరదృష్టి, నరఘోష సమస్యలు, అనారోగ్యంతో బాధపడుతున్న వారు స్వామిని నియమంగా సేవించుకొంటే సమస్యలు త్వరితగతిన దూరం అవుతాయన్నది తరతరాల విశ్వాసం.శ్రీ భద్రకాళీ శ్రీ వీరభద్రస్వామి కళ్యాణం కూడా విశేషంగా జరుపుతారు. ముఖమండపంలో నందీశ్వరుడు, శ్రీ వినాయకుడు,



శ్రీ సుబ్రహ్మణ్య స్వామి దర్శనమిస్తారు. గర్భాలయంలో స్థానిక భంగిమలో అష్టభుజాలతో శాంతి గంభీర రూపంలో కొలువై ఉంటారు. అదే గర్భాలయంలో శ్రీ భద్రకాళీ అమ్మవారు

దక్షిణ ముఖంగా భక్తాభీష్ట వరదాయనిగా ఉపస్థితురాలై దర్శనమిస్తారు.కొల్లిపరలో శ్రీ ఆంజనేయస్వామి వారి దేవస్థానం, శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ సమేత శ్రీ గోపయ్య స్వామి ఆలయం. శ్రీ షిర్డీ సాయిబాబా మందిరం కూడా ఉన్నాయి. అత్యంత సమీప గ్రామాలైన తూములూరు, చిలుమూరు, చివలూరులలో కూడా పురాతన విష్ణు మరియు శివాలయాలు ఉన్నాయి. ఇన్ని విశేషాల కొల్లిపర విజయవాడకు, గుంటూరు కు కూడా ముప్పై అయిదు కిలోమీటర్లు, తెనాలికి ఇరవై కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. బస్సు సౌకర్యం లభిస్తుంది. కానీ స్వంతవాహనంలో వెళ్లడం వలన దగ్గరలో ఉన్న గ్రామాలలోని ఆలయాలను దర్శించుకునే అవకాశం ఉంటుంది.వసతి సౌకర్యం లేదు. భోజనసదుపాయాలు లభిస్తాయి. మన రాష్ట్రంలో గ్రామగ్రామాన ఉన్న పురాతన ఆలయాలను సందర్శిద్దాము. మన ఆలయాల గుర్తింపుకు పాటుపడదాము, మనవైన విశేష ఆలయాల ఖ్యాతి ప్రపంచవ్యాప్తం చేద్దాము.

నమః శివాయ !!!!



**మానవునికి చేరువైన తొలిసుగంధ ద్రవ్యం కుంకుమ పువ్వు సుగంధ ద్రవ్యాలలో అత్యంత ఖరీదైనది కుంకుమ పువ్వు మనదేశంలో ఇది కశ్మీర్లో అధికంగా పండుతుంది. అందుకే దీన్ని కశ్మీర్ ఎర్ర బంగారం అని పిలుస్తారు. కేజీ కుంకుమ పువ్వు ధర దాదాపు 70 గ్రాములు పైబడిన బంగారంతో సమానమని చెప్పవచ్చు.**

# ఎర్ర బంగారం కుంకుమ పువ్వు

షేక్ అబ్దుల్ హాకీం జాని

### కుంకుమ పువ్వు చరిత్ర

క్రీ.పూ.500 సంవత్సరాలకు ముందే కుంకుమ పువ్వు ప్రస్తావన ఉంది. కుంకుమ పువ్వును ఆంగ్లంలో శాఫ్రాన్ ఫ్రాన్ అని పిలుస్తారు. ఇరిడాసే కుటుంబానికి చెందిన కుంకుమ పువ్వును ప్రధానంగా శీతల ప్రదేశాల్లో పండిస్తారు. కుంకుమపువ్వు అనేది ఆసియాలో లభించే ఒక సుగంధ ద్రవ్యం. దీనిని శాస్త్రీయనామం క్రోకస్ సాటివస్, ఇది ఔషధ మొక్కగా మంచి చరిత్రను కలిగి ఉంది. కుంకుమ పువ్వును "సన్షైన్ స్పైస్" అని కూడా పిలుస్తారు. తరచుగా తీపి వంటలలో రంగు ఇంకా సువాసన ఇచ్చే దినుసుగా ఇది ఉపయోగించబడుతుంది. కుంకుమ పువ్వులో ఎర్ర కేసరాలు మాత్రమే ఉపయోగపడే భాగం, పువ్వు మధ్య ఉండే రేణువులనే ఎర్రకేసరాలు అని పిలుస్తారు. ఒక కిలో కుంకుమ పువ్వు సేకరించాలంటే కనీసం రెండు లక్షల పూలు అవసరమవుతాయి. అందుకే కుంకుమ పువ్వు ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన సుగంధ ద్రవ్యంగా పిలుస్తున్నారు. కేసరాలు రుచికి కొద్దిగా చేదుగా, తియ్యగా వుంటాయి. పలు దేశాల్లో కుంకుమ పువ్వు పంట మన దేశంలో ఇది కేవలం కాశ్మీర్ ప్రాంతంలో మాత్రమే పండుతుంది. నేడు పలు ప్రాంతాలలో పండించే ప్రయత్నాలు చేస్తున్నారు.

నిజానికి దీని స్వస్థలం దక్షిణ ఐరోపా. అక్కడ నుంచే వివిధ దేశాలకు విస్తరించింది. గ్రీసు, స్పెయిన్, ఇరాక్, ఇటలీ, సిసిలీ, టర్కీ, ఇంగ్లాండ్, ఫ్రాన్స్ దేశాల్లో దీన్ని ఎక్కువగా పండిస్తారు. అన్నింటిలోకీ కాశ్మీరీ కేసర్ నాణ్యమైనదిగా ప్రపంచ ప్రసిద్ధి చెందింది. మనదేశంలో ఉత్తరాది రాష్ట్రాలవారు కుంకుమ పువ్వును 'కేసర్' అని పిలుస్తారు. కుంకుమ పువ్వును ఇరాన్ దేశం అత్యధికంగా పండిస్తుంది. వర్షాకాలం చివరలో కుంకుమ దుంపలను దున్నిన భూమిలో నాటుతారు. ఎండాకాలం ఆరంభానికి కోత కోస్తారు. కుంకుమ పువ్వు పండాలి అంటే వాతావరణంలో అధిక తేమ ఉండకూడదు. మట్టి గుల్లగా ఉండాలి.



అత్యధికంగా ప్రకృతిసిద్ధమైన ఎరువులు వాడాలి. వర్షపాతం తక్కువగా ఉండాలి. దుంప నాటిన రెండు నెలలకే పుష్పాలు పూస్తాయి. శీతాకాలం చివరలో కుంకుమ పువ్వు పంట కోతకు వస్తుంది. కుంకుమ పువ్వును ఇంటి వద్ద కుండీల్లో కూడా పెంచుకోవచ్చు. కుండీ మట్టిలో కొబ్బరి పొట్టు, వానపాముల ఎరువు సమాన భాగాలుగా ఉండాలి. కుంకుమ పువ్వు మొక్కలను పూర్తి ఎండలోగాని, పాక్షిక ఎండలోగాని పెంచుకోవచ్చు. దక్షిణ భారతదేశంలో కుంకుమ పువ్వు దుంపలను అక్టోబరు నెలలో నాటితే మంచిది.

### కుంకుమ పువ్వు సాగు

కుంకుమపువ్వు మొక్క చూడ్డానికి ఉల్లి, ఎర్ర లిల్లీ మొక్కలా ఉంటుంది. చిన్న దుంపవేరు నుంచి ఆకులు పైకి వచ్చి వాటి మధ్యలో పూలు వస్తాయి. కాశ్మీర్లో పండించే కుంకుమ పువ్వు మొక్కకి పైకి ఆకులు కూడా కనిపించవు. కేవలం వంగపండు రంగు పువ్వు మాత్రం కనిపిస్తుంది. కాశ్మీర్లోని పాంపోర్ ప్రాంతంలోని నేలంతా అక్టోబరు నవంబరులో విరబూసిన కుంకుమ పువ్వుతో నిండిపోతుంది. ముందు మొగ్గ వచ్చి పువ్వు విచ్చుకుంటుంది. అదే కుంకుమ పువ్వు అనుకుంటే పొరపాటే. అందులో ముచ్చటగా మూడే అండకోశాలు, రెండు కేసరాలు ఉంటాయి. కిందభాగంలో పసుపు, పైన ఎరుపురంగులో ఉండే ఈ అండకోశాలనే కుంకుమ పువ్వుగా పిలు స్తారు. ఈ ఎరుపురంగు భాగమే ఘాటైన వాసన, రుచి, రంగును ఇస్తుంది. ఉదయాన్నే విచ్చుకునే ఈ పూలను వెంటనే కోసి అందులోని ఎరుపురంగులో ఉండే అండకోశ భాగాలను తుంచి ఎండబెడతారు. అప్పుడే అవి మంచి వాసనతో ఉంటాయి. విచ్చుకున్న పూలను కొయడానికి ఒక్కపూట అలస్యం చేసినా అవి వెంటనే వాడిపోతాయి. అండ కోశాలు రంగునీ రుచినీ కోల్పోతాయి. అందుకే పూసిన పూలన్నింటినీ ఉదయం పదిగంటలలోపే కోసేస్తారు. ప్రతి పూవ్వు నుంచీ అండ కోశాలను చేత్తోనే వేరుచేయాలి. ఇది ఎంతో శ్రమతో కూడిన పని. శాఫ్రాన్ అంత ధర పలకడానికి ఇదీ ఓ కారణమే. మన దగ్గర గ్రాము కుంకుమ పువ్వు ధర సుమారు రూ.60 నుంచి 600 వరకూ ఉంటుంది. నాణ్యతనుబట్టి ధర మారుతుంది. అతి తక్కువ ధరకు లభించే కుంకుమ పువ్వు నాణ్యత లేనిదో. నకిలీదో అని గుర్తించాలి. మనిషి వాడిన మొదటి సుగంధద్రవ్యం ఇదేనట. సుగంధద్రవ్యాల్లోకెల్లా ఇది అత్యంత ఖరీదైనది.

## కుంకుమ పువ్వు ఉపయోగాలు

కుంకుమ పువ్వు వలన అనేక ఉపయోగాలు ఉన్నాయి. కుంకుమ పువ్వులో క్రోసిన్, క్రోసిటిన్, పిక్రో క్రోసిన్ వంటి గ్లూకోసైడులు ఉన్నాయి. వీటితో పాటు బీటా, గామా కెరోటిన్ లు, లైకోఫీసులు అనే రసాయనాలు ఉన్నాయి. కుంకుమ పువ్వులో విటమిన్ 'ఎ', ఫోలిక్ యాసిడ్, విటమిన్ 'సి' ఎక్కువగా ఉన్నాయి. ఇంకా ఇందులో శక్తి 15.5%, కార్బోహైడ్రేట్స్ 50%, ప్రోటీన్స్ 21%, ఫ్యాట్స్ 21%, విటమిన్స్ 77%, మినరల్స్ 37% ఉన్నాయి. కుంకుమ పువ్వురంగు పదార్థంగాను, సువాసనకారిగాను అనేక తినుబండారాలు, తాంబూలంలోనూ వాడతారు. ఇది నేత్ర వ్యాధులలోను, ముక్కు సంబంధమైన వ్యాధులలోను మందుగా పనిచేస్తుంది. ప్రతిదినం కుంకుమ పువ్వును తేనెతో కలిపి తెల్లవారు ఝూమున సేవిస్తే ధాతుపుష్టికి, వీర్యవృద్ధికి పనిచేస్తుంది. కుంకుమ పువ్వు గంధంలా తయారు చేసి ముఖానికి రాస్తే మొటిమలు తగ్గి, చర్మం సున్నితంగా ఆకర్షణీయంగా తయారవుతుంది. మంచిరంగు, రుచి, వాసన ఉన్న అరుదైన సుగంధ ద్రవ్యమే కుంకుమ పువ్వు అందుకే దీన్ని అందరూ 'ఎర్ర బంగారం' అని పరిగణిస్తారు. పుట్టబోయే పిల్లలు మంచి రంగుతో పుట్టాలని సాధారణంగా గర్భిణీలు ఎక్కువగా కుంకుమ పువ్వును తీసు కుంటారు. దీన్ని గర్భిణీలు మాత్రమే కాకుండా పురుషులు కూడా తీసుకో వచ్చు. దాని వల్ల చాలా ఉపయోగాలు ఉన్నాయి. మెదడు పనితీరుని మెరుగు పరుస్తుంది. గుండెపోటును నివారించ డమే కాకుండా కాలేయ ఆరోగ్యాన్ని మెరుగు పరుస్తుంది. కుంకుమ పువ్వు తీసుకోవడం వల్ల మానసిక స్థితిని మెరుగుపరుస్తుంది. రోగనిరోధక వ్యవస్థను బలపరుస్తుంది. చర్మం, జుట్టుకు మేలు చేస్తుంది. కుంకుమ పువ్వులో అధిక శాతం యాంటీ ఆక్సిడెంట్‌ను కలిగి ఉండటం వల్ల ఫ్రీ రాడికల్స్ను పెంచకుండ సహాయ పడుతుంది. స్త్రీలకు నెలసరి సమ యంలో వచ్చే కడుపునొప్పితో పాటు తలనొప్పి, చిరాకు, ఆందోళన ఇత్యాది అనేక సమస్యలు తలెత్తకుండా నివారి స్తుంది. కుంకుమ పువ్వు కంటికిమేలు చేస్తుంది. ఈ పువ్వులో క్రోసిన్, క్రోసిటిన్, పిక్రో క్రోసిన్ ఇత్యాది గ్లూకోసైడులు ఉన్నాయి. వీటితో పాటు బీటా, గామా కెరోటిన్లు, లైకోఫీసులు ఉన్నాయి. ఇంట్లో గర్భిణి ఉంటే కుటుంబసభ్యులు కుంకుమ పువ్వును కొనితెస్తారు. అదనపు రంగు కోసం దీన్ని వంటకాల్లోనూ వినియోగిస్తారు. ఈ రెండు ఉపయోగాలు అందరికీ తెలిసినవే. తెలియనిది మరొకటుంది. ఏంటంటే దీనివల్ల కంటికి చాలా మేలు కలుగుతుంది. వృద్ధాప్యం మీద పడు తున్న కొద్దీ కంటి చూపు తగ్గుతుంది. కుంకుమ పువ్వులో దీన్ని మెరుగుపరిచే కారకాలున్నాయి. పాలు, కాఫీ, టీలలో కుంకుమ పువ్వు ఉపయోగిస్తారు. ఇంకా అనేక సౌందర్య ఉత్పత్తులు, పలు రకాల ఔషధాలలో కూడా దీన్ని విరివిగా



వాడతారు. వైద్య పరంగా కూడా కుంకుమ పువ్వు ఉపయోగాలు చాలా ఉన్నాయి. అందుకే యాభైకి పైబడు తున్న వారంతా తరచూ ఆహారంలో కుంకుమ పువ్వును తీసుకుంటే మంచి దని వైద్యనిపుణులు సూచిస్తున్నారు. కుంకుమ పువ్వులో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉన్నాయి. ఇవి శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచడంలో, రక్త నాళాలను ఆరోగ్యం గా ఉంచడంలో సహాయపడతాయి. గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. అంతే కాదు రక్తపోటు, కొలెస్ట్రాల్ స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది. దీనిలో క్యాన్సర్ను నివారించే కీమో ప్రివెంటివ్ లక్షణాలు న్నట్లు కూడా తాజా పరిశోధనలో గుర్తించారు. కిడ్నీ, నరాలకు ఇబ్బంది కలిగించే టాక్సిన్ దీనిలో వుంది కాబట్టి ఎక్కువ మోతాదులో వినియోగించవద్దని వైద్యుల సూచన, కుంకుమ పువ్వు తీసుకోవడం వలన ఆరోగ్యం మరింత మెరుగవు తుంది. గర్భిణులు మొదటి నెలనుండీ కుంకుమపువ్వు వాడవచ్చును. గర్భవతు లకు మొదటి మూడు నెలలు వేవిళ్ళు ఉంటాయి కాబట్టి అనుకూలత బట్టి వాడాలి. తేనె, పాలు, పటికబెల్లం, పంచదారలతో కుంకుమ పువ్వు కలిపి తినవచ్చును. రాత్రివేళ ఆహారంలోనో, ఏదో ఒక పానీయములోనో కొద్దిపాటి కుంకుమ పువ్వురేకులు వేసుకుని సేవిస్తే గాఢమైన నిద్ర పడుతుంది. నిజానికి కుంకుమ పువ్వులో ఈ గుణాలు రోమన్ల కాలము నాడే గుర్తించారు. ధనవంతు లైన రోమన్లు హాయిగా నిద్రించేందుకు గాను తమ దిండ్లపై కుంకుమ పువ్వు ఫిలమెంట్లను కుట్టించుకునేవారట. కుంకుమ పువ్వు జీర్ణశక్తిని పెంచుతుంది. రక్తప్రసరణను మెరుగుపరిచి రక్తపోటును తగ్గిస్తుంది. కుంకుమ పువ్వును పూర్వం చైనీయుల వైద్యంలో విరివిగావాడే వారు. వారు ఎక్కువగా కాలేయ సామర్థ్యాన్ని పెంచేందుకు ఉపయో గించేవారు. ఆయుర్వేదంలో ఉదరం పని తీరును మెరుగుపరిచేందుకు, జీర్ణక్రియ సంబంధిత సమస్యల నివారణకు దీన్ని ఉపయోగిస్తారు. జీర్ణరసాల ప్రసరణకు, మోనోపాజ్ సమస్యల చికిత్సకు కూడా కుంకుమపువ్వును వినియోగిస్తారు. దగ్గు, కడుపుబ్బరం చికిత్సకై దీన్ని వాడతారు. శారీరక రుగ్మతలతో పాటు డిప్రెషన్ను కూడా కుంకుమ పువ్వు తొలగిస్తుంది. శరీరంలో కామోద్దీపనలను పెంచే న్యూరో ట్రాన్స్ మీటర్లను. డోపమైన్ ఫైన్లను వృద్ధి చేస్తుంది. గత కొన్నేళ్లుగా వాతావరణంలో మార్పులు, కాలుష్యం కారణంగా కుంకుమ పువ్వు పంటకు మునుపటి శోభ లేదు. గత రెండు దశాబ్దాల్లో కుంకుమపువ్వు ఉత్పత్తిలో 60 శాతం తగ్గదల నమోదైందని అధికారులు చెబుతున్నారు.

### కుంకుమ పువ్వు స్వచ్ఛమైనదేనా!?

నకిలీదా? అని కనుగొనడానికి అనేక మార్గాలున్నాయి. కుంకుమ పువ్వు రేకులను కొద్ది సేపు నీటిలో ఉంచి బయటకు తీస్తే నకిలీ రేకులు ఎరుపు వర్ణాన్ని కొంతమేరకు కోల్పోతాయి స్వచ్ఛ మైన కుంకుమ పువ్వు ఎండుగడ్డి, తేనె కలయిక వంటి వాసనను కలిగి ఉం టుంది. కొద్ది మొత్తంలో బేకింగ్ సోడాను నీటిలో కరిగించి ఆ ద్రవంలో కుంకుమ పువ్వును కలపండి. నీరు-బేకింగ్ సోడా మిశ్రమంలో కలిసిన స్వచ్ఛమైన కుంకుమ పువ్వు అయితే అది పసుపు రంగులోకి మారుతుంది

# ఏప్రియల్ 13, 2025 నుండి ఏప్రియల్ 19, 2025 వరకు



## వారఫలం


శ్రీమతి ములుగు శివజ్యోతి, ప్రముఖ జ్యోతిష్కురాలు

నారాయణ నాయక్ కాంప్లెక్స్, 2వ అంతస్తు,
గాంధీ జ్ఞానమందిర్ వెనుక, కోఠి, హైదరాబాద్-1
ఫోన్ : 98494 53449, 9440927795




### మేషం

ఈ వారం గృహనిర్మాణ ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి. శ్రమకు తగిన ఫలితం అందుకుంటారు. భూవివాదాలు తీరి నూతన ఒప్పందాలు కుదురుతాయి. ఎరుపు వత్తులు అష్టమూలికాతైలంతో దీపారాధన చేయటం అన్ని విధాలా మంచిది. కొత్త ఉద్యోగావకాశాలు పొందుతారు. వృత్తి, వ్యాపారాలలో అభివృద్ధి చెందుతాయి. పారిశ్రామిక, రాజకీయ రంగాల వారికి అన్ని విధాలా అనుకూల సమయం.



### వృషభం

ఈ వారం ఆస్తి వివాదాలు తీరి నూతన ఒప్పందాలు కుదురుతాయి. కోర్టుకేసులు పరిష్కారమవుతాయి. సంఘంలో మీ మాటకు విలువ పెరుగుతుంది. ప్రతిరోజూ స్నానం చేసేటప్పుడు బకెట్‌లో రెండు చెంచాలు ఐశ్వర్యనాగిని పొడిని వేసి స్నానం చేయండి. విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు.కొత్త విద్యావకాశాలు దక్కుతాయి. వృత్తి, వ్యాపారాలలో ఆశించిన పురోగతి కనిపిస్తుంది.



### మిథునం

ఈ వారం స్థిరాస్తి వృద్ధి చెందుతుంది. గృహనిర్మాణ ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి. రెండు, మూడు విధాలుగా ఆర్థిక లాభాలు పొందుతారు. సంఘంలో ఎనలేని గౌరవం పొందుతారు. దూరప్రాంతాల నుండి వచ్చిన ఆహ్వానం ఆశ్చర్యం కలిగిస్తుంది. నిత్యం హనుమాన్ సింధూరం ధరించటం వలన మనోధైర్యం, ఆత్మవిశ్వాసం పెరుగుతుంది.



### కర్కాటకం

ఈ వారం వృత్తి, వ్యాపారాలు ప్రోత్సాహకరంగా సాగుతాయి. రాజకీయ, కళారంగాల వారికి సన్మాన సత్కారాలు పొందుతారు. ప్రయాణాలలో నూతన మిత్రుల పరిచయాలు. నిత్యం మహాతీర్థం పొందటం వల్ల సౌఖ్యం, సంతోషం కలుగుతుంది. ఆర్థిక ఇబ్బందుల నుండి బయట పడతారు. బంధువులతో ఉత్తర ప్రత్యుత్తరాలు సాగుతాయి. అనుకోని అవకాశాలు లభిస్తాయి.



### సింహం

ఈ వారం భూములు, వాహనాలు కొనుగోలు చేస్తారు. వృత్తి, వ్యాపారాలు అభివృద్ధి సాధిస్తారు. రాజకీయ, కళారంగాల వారికి ప్రభుత్వ రంగాల నుండి ఆహ్వానాలు అందుతాయి. నిత్యం లక్ష్మీకటాక్షం ముఖానికి రాసుకోవాలి. దీని వల్ల లక్ష్మీదేవి అనుగ్రహం కలుగుతుంది. ఆరోగ్యం పట్ల మెలుకువ అవసరం. వివాదాలకు దూరంగా వుండండి.



### కన్య

ఈ వారం కుటుంబ బాధ్యతలు పెరిగినా సమర్థంగా నిర్వర్తిస్తారు. వివాహ, ఉద్యోగ యత్నాలు అనుకూలంగా వుంటాయి. వృత్తి, వ్యాపారాలు అభివృద్ధి సాధిస్తారు. అందరికి సమస్త శుభాలను చేకూరుస్తుంది ఈ ప్రథమ తాంబూలము. రాజకీయ, కళారంగాల వారికి సత్కారాలు పొందుతారు. ప్రయాణాలలో ఆటంకాలు ఎదురైన అధిగమించి ముందుకు సాగుతారు. మానసిక అశాంతి.



### తుల

ఈ వారం ఆర్థిక వ్యవహారాలలో కాస్త సంతృప్తి పొందుతారు. ఖర్చులు పెరుగుతాయి. బంధువులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు. పోటీ పరీక్షలలో విజయం సాధిస్తారు. నిత్యం దీపారాధన కుందిలో రెండు చుక్కలు పరిమళ గంధము వేయండి. లక్ష్యసాధనకు శ్రమిస్తారు. జీవిత భాగస్వామి సలహాల మేరకు కొన్ని వ్యవహారాలు పూర్తి చేస్తారు. వృత్తి, వ్యాపారాలలో అనుకూల స్థితి. ధనవ్యయం పెరుగుతుంది.



### వృశ్చికం

ఈ వారం సంఘంలో గౌరవప్రతిష్ఠలు పొందుతారు. ఆర్థిక పరిస్థతి మెరుగై రుణాలు తీరుస్తారు. ఇంటా బయటా మీదే పైచేయిగా వుంటుంది. గృహనిర్మాణ ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి. ఆప్తుల నుంచి అందిన సమాచారం సంతోషం కలిగిస్తుంది. నిత్యం లక్ష్మీతామర వత్తులు అష్టమూలిక తైలంతో కలిపి దీపారాధన చేయటం అన్ని విధాలా మంచిది. వృత్తి, వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి.



### ధనస్సు

ఈ వారం రాజకీయ, కళారంగాల వారికి విదేశీ పర్యటనలు వుంటాయి. క్రయవిక్రయాలలో లాభాలు పొందుతారు. ముఖ్యమైన వ్యవహారాలలో ఆటంకాలు ఎదురైన అధిగమిస్తారు. ఏ దేవతకైనా ఏ దేవునికైనా సుగంధ గంధాక్షింతలతో పూజించిన మంచి ఫలితాలు వుంటాయి. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వుంటుంది. కుటుంబసభ్యుల నుంచి ఒత్తిడులు ఎదురైనా అధిగమిస్తారు. కొత్త రుణాల కోసం ప్రయత్నాలు చేస్తారు.



### మకరం

ఈ వారం అవకాశాలు కొన్ని నిరాశపరుస్తాయి. కుటుంబ బాధ్యతలు ఉక్కిరి బిక్కిరి చేస్తాయి. ఆరోగ్యం మందగిస్తుంది. వృత్తి, వ్యాపారాలలో కొన్ని మార్పులు జరిగే సూచనలు. రాజకీయ, కళారంగాల వారికి సన్మానాలు పొందుతారు. జిల్లేడు వత్తులు అష్టమూలికాతైలంతో కలిపి దీపారాధన చేయటం అన్ని విధాలా మంచిది. దూరప్రాంతాల నుండి వచ్చిన ఆహ్వానం ఆశ్చర్యపరుస్తుంది.




### కుంభం

ఈ వారం రుణబాధలు తొలగుతాయి. రాబడి పెరుగుతుంది. ఇంటా బయటా అనుకూల వాతావరణం. ఉద్యోగ, వివాహ యత్నాలు ముమ్మారం చేస్తారు. గృహనిర్మాణ ఆలోచనలు నిదానంగా కార్యరూపం దాలుస్తాయి. నిత్యం జువ్వాదితో దేవతార్చనము చేయటం వలన భగవంతుని అనుగ్రహం లభిస్తుంది. వృత్తి, వ్యాపారాలు ప్రోత్సాహకరం. ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి.




### మీనం

ఈ వారం కుటుంబ బాధ్యతలు అధికమై సమర్థవంతంగా నిర్వర్తిస్తారు. ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది. దీర్ఘకాలిక రుణాలు తీరుస్తారు. పెట్టుబడుల్లో లాభాలు పొందుతారు. అనుకున్నది సాధిస్తారు. వృత్తి, వ్యాపారాలలో లక్ష్యాలు సాధిస్తారు. నిత్యం సర్వరక్షాచూర్ణము, సర్వదోష నివారణ చూర్ణము కలిపి స్నానం చేయటం వలన నవగ్రహ దోషాలు పోయి మాని జరుగుతుంది. ఆరోగ్యం పట్ల జాగ్రత్త అవసరం.


అక్కడ గూళ్ళు చెదిరి పోయాయట.. వచ్చేప్పుడు
నాలుగు నెమళ్ళని తీసుకురండి.. పెంచుకుందాం!!


డాక్టర్ గారు ఈ టెస్టులు చేయించుకు రమ్మన్నారు..
ల్యాబ్ వాడికి వార్నింగ్ ఇవ్వండి. రిపోర్ట్సు పర్ఫెక్ట్ ఇవ్వాలని!!
మంత్రి


ఇప్పటి దాకా ఎవరూ పెట్టని సీన్.. విలన్ AK 47 తో హీరో పై బుల్లెట్ల వర్షం
కురిపిస్తాడు.. మన హీరో ఆ బుల్లెట్లను రెండు చేతుల్తో పట్టుకుని విలన్ గ్యాంగ్ పైకి
విసుర్తాడు.. వాళ్ళంతా చేతులు కాళ్ళు తెగి పడి చచ్చిపోతారు...!! ఎలా ఉంది సార్..?

# కార్టూన్ కా'ర్టూన్'





సెనెగల్‌లోని ఈ దీవిని ఫాడియౌత్ దీవి అంటారు. ఎక్కడ చూసినా రాశులు పోసిన గవ్వలు కనిపిస్తుంటాయి. అందుకే దీనిని గవ్వల దీవి అని కూడా పిలుస్తారు.







